# లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
LGTV
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్
ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,204 | పేజీలు -12 | శనివారం -23 - మే - 2026 | వెల రూ.2/-
PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094


## అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్,స్కిల్డ్, హైస్కిల్డ్‌గా కార్మికుల విభజన

### కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల ఆధారంగా వేతనాల ఖరారు

- ★కార్మికుల కనీస వేతనాల పెంపు.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి
- ★కనీస వేతనాలు అమలు చేయని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామన్న ముఖ్యమంత్రి
- ★గల్ఫ్ కార్మికులకు సంబంధించి మంచి పాలసీతో వస్తామని వెల్లడి



హైదరాబాద్: రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించి వారు పనిచేసే గ్రామీణ/పట్టణ ప్రాంతాల ఆధారంగా వారి వేతనాలను సవరించింది. జూన్ 1 నుంచి ఈ కొత్త వేతనాలు అమల్లోకి రానున్నాయి. మిగతా..2లో

## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా, బండి సంజయ్ ఇలా కేటీఆర్ విమర్శలు



- బండి సంజయ్ లొంగుబాటు అంటే, రేవంత్ రెడ్డి అరెస్టు అంటున్నారని ఆగ్రహం
- ఇద్దరు తోడు దొంగలు కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డికి హైట్ మాత్రమే తక్కువ కాదు బుర్ర కూడా తక్కువ అని ఎద్దేవా

హైదరాబాద్: బండి భగీరథ్ లొంగిపోయాడని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చెబితే, పోలీసులే అరెస్టు చేశారని మిగతా..2లో

## రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల..



- ఏపీలో ఖాళీ అవుతున్న 4 రాజ్యసభ స్థానాలు!
- జూన్, జులై నెలల్లో ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం
- జూన్ 18న పోలింగ్.. అదే రోజున ఫలితాలు
- ఏపీలో 4 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే

## అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్... సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

### రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం
- తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం



అమరావతి: రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఏపీలోని కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. మిగతా..2లో

## రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే 600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తి



అమరావతి: ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం

## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర హోం మంత్రి అనిత



- కడప జిల్లాకు చెందిన అభినయ్ కు అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందన్న అనిత

## దేశం కష్టాల్లో ఉంది.. సీఎంలతో సమావేశం జరపండి

- ప్రధాని మోదీకి కమల్ హాసన్ విజ్ఞప్తి
- ఇరాన్ యుద్ధ ప్రభావంపై సీఎంలతో జాతీయ సదస్సు జరపాలని ప్రధానికి కమల్ విజ్ఞప్తి
- పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రాల వ్యాట్ తగ్గించాలని కీలక సూచన
- ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపును సమర్థించిన నటుడు
- రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య
- ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా బాధ్యత పంచుకోవాలని పిలుపు

ఢిల్లీ: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి సామాన్య ప్రజలను కాపాడేందుకు జాతీయ స్థాయిలో ఒక సమన్వయ యంత్రాంగాన్ని రూపొందించాలని నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ మిగతా..2లో



## భారాస సభ్యత్వ నమోదుకు ఇన్‌ఛార్జులు

### హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో డిజిటల్ శిక్షణ

హైదరాబాద్: భారాస పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా.. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో పాటు.. ప్రతి నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఐటీ నిపుణులకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో డిజిటల్ శిక్షణ ఇస్తారు. అనంతరం.. వీరు భారాస పార్టీ జిల్లా కార్యాలయాల్లో ఇప్పటికే నియమితులైన పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఆయా నియోజకవర్గంలో ఉన్న బూత్‌ల సంఖ్యను బట్టి.. బూత్‌కు ఇద్దరికి చొప్పున వారం రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ మొత్తం డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన వెంటనే.. సభ్యత్వ నమోదు తేదీని ప్రకటిస్తారు. అదే రోజు పార్టీ అధినేత కేసీఆర్ సహా పార్టీ ముఖ్యులంతా సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొంటారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రకాల కమిటీలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు.



## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం ఫార్మా సిటీని మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడి



- అమెరికా పర్యటనలో వ్యాఖ్యలు
- 16 వేల ఎకరాల భూసేకరణ పూర్తైందని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన మిగతా..2లో

## మహిళా సంఘాలకు రుణాలపై భట్టివిక్రమార్క శుభవార్త

### వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న భట్టివిక్రమార్క

- సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత
- హైదరాబాద్: వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు ఇస్తున్నాయని బ్యాంకులకు కితాబు



హైదరాబాద్: మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.



## లోక్ సభ సీట్లపై నారా లోకేష్..వర్సెస్ షర్మిల

### సమాఖ్య స్ఫూర్తిని వదిలి టీడీపీ ఇప్పుడు బీజేపీని సమర్థిస్తోందని విమర్శ

- నియోజకవర్గాల పునర్విభజనపై లోకేష్ గందరగోళం సృష్టిస్తున్నారని షర్మిల విమర్శ
- జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించవద్దని కాంగ్రెస్ వాదన
- సీట్లు పెంచడం కాదు, పార్లమెంటులో సాపేక్ష ప్రాతినిధ్యమే కీలకమని స్పష్టీకరణ

అమరావతి: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టీడీపీ నేత నారా లోకేష్ లేనిపోని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. మిగతా..2లో



## తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు.. 15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు

- మొత్తం ఖాళీల్లో 12,882 హెల్పర్, 3,100 టీచర్ పోస్టులు
- ఈ ఏడాదిలోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ ప్రారంభం
- త్వరలో విడుదల కానున్న నియామక మార్గదర్శకాలు

## కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: చెరుకు శ్రీనివాస్ రెడ్డి

తొగుటలో కనీస వేతనాల అమలుపై సంబరాలు -- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



తొగుట (లోకల్ గైడ్) మే 22:తొగుట మండల కేంద్రంలో కార్మికుల కనీస వేతనాల అమలుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి మరియు మంత్రి , వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రమ జీవుల హక్కుల పరిరక్షణ, ఉపాధి భద్రత, సామాజిక భద్రత కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ



ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి కార్మిక సంఘాలు, పరిశ్రమల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన అనంతరం జూన్ 1 నుంచి కొత్త కనీస వేతనాలను అమలు చేయాలని నిర్ణయించడం కార్మికులకు శుభపరిణామమని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా నాలుగు విభాగాలుగా విభజించి కనీస వేతనాల అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పిట్ల సత్తయ్య, సర్పంచులు పాగల శోభా కొండల్ రెడ్డి, రాంపురం రమేష్, లాచోళ్ల రవీందర్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఉపేందర్, ఉపసర్పంచులు గౌస్, తిరుపతి, మురళి, డైరెక్టర్లు బాలమల్లు, అన్సర్, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనకర్ రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, భారత్ తేజ, పోచయ్య, రవీందర్, బాల్ రెడ్డి, నరసింహులు, రమేష్ గౌడ్, నర్సింలు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య బాధాకరం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్



బెజ్జంకి (లోకల్ గైడ్) మే 22:ఎర్రవెల్లివాడం చిలాపూర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు గుంటి బాలయ్య అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మృత రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి వారి ఆర్థిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు దీటి బాలనర్సు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, ఎలా శేఖర్ బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహానీయులు భాగ్యరెడ్డి వర్మ..

--- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి..



వనపర్తి లోకల్ గైడ్ మే 22:( అంబటిస్వామి ప్రతినిధి) దళితుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేసిన మహానీయుడు భాగ్యరెడ్డి వర్మ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కొనియాడారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, అనగారిన వర్గాల శ్రేయస్సుకోసం భాగ్య రెడ్డి వర్మ కృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపుమాపేందుకు పోరాటం చేశారని కొనియాడారు. దళిత ఉద్యమ పితా మహుడిగా, సంఘ సంస్కర్తగా భాగ్యరెడ్డి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని, సమాజంలో దళితుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహానుభావుల జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని, మహానీయుల చరిత్ర, త్యాగాలను బావి తరాలకు అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహానీయులు ఆచరించిన మార్గాలను బావితరాలకు అందిస్తూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, మహనీయుల ఉత్సవ కమిటీ ఛైర్మెన్ గంధం నాగరాజు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు లక్ష్మయ్య యాదవ్ సంవత్సరికం సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరం

"సేవే మా ఘన నివాళి" ప్రజలను పాల్గొనాలని బోయిని అనూష మహేష్ యాదవ్ పిలుపు




శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హఫీజ్‌పేట్ డివిజన్‌లో కీర్తిశేషులు లక్ష్మయ్య యాదవ్ సంవత్సరికం సందర్భంగా వారి స్మారకార్థం మే 23వ తేదీన ఉదయం 9.00 గంటల నుండి ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు అందించబడతాయని పేర్కొన్నారు. అలాగే రక్తదానం ద్వారా అవసరమైన వారికి ప్రాణదానం చేసే గొప్ప అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మనిషి జీవితంలో చేసే సేవలలో రక్తదానం అత్యంత గొప్పదని, ఒక్క యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. అలాగే ఆరోగ్య పరీక్షల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, హఫీజ్‌పేట్ పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె హృదయపూర్వకంగా కోరారు. రక్తదానం మహాదానం– ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరం తోడ్పడాలి. కీర్తిశేషులు లక్ష్మయ్య యాదవ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా వారికి ఘన నివాళి అర్పించినట్లవుతుందని బోయిని అనూష మహేష్ యాదవ్ అన్నారు. "ఒక చుక్క రక్తం..ఒక ప్రాణానికి ఆశ" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే ఉచిత ఆరోగ్య శిబిరం ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే అవకాశం పొందాలని తెలిపారు. "ఒక చుక్క రక్తం..ఒక ప్రాణానికి ఆశ!" "సేవే పరమో ధర్మః– రక్తదానం మహాదానం! అని తండ్రి స్మృతికి మీ భాగస్వామ్యమే గొప్ప నివాళి.

## ప్రజలకు సమాచారం లేకుండా నాలా పనులు చేపట్టడం దారుణం : బీజేపీ ఆగ్రహం

–స్థానికుల నిరసనతో వీడియో కాలనీలో నాలా పనులు తాత్కాలికంగా నిలిపివేత



శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ డివిజన్ పరిధిలోని వీడియో కాలనీలో ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, స్థానికుల అభిప్రాయాలను పూర్తిగా పక్కనపెట్టి నాలా పనుల పేరుతో భారీ గుంతలు తవ్వడాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కమిషన్ల కోసమే ఈ పనులు చేపడుతున్నారని, దీంతో కాలనీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కాలనీ వాసులతో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, బీజేపీ సీనియర్ నాయకులు సమ్మెట ప్రసాద్ తో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాలా పనుల వల్ల కాలనీ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని, ప్రజలకు ఇబ్బందులు ప్రమాదాలు మాత్రమే ఎదురవుతున్నాయని నాయకులు అధికారులను నిలదీశారు. ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా, సరైన భద్రతా చర్యలు పాటించకుండా పనులు చేపట్టడం పూర్తిగా నిర్లక్ష్యపూరిత చర్య అని మండిపడ్డారు. ఈ సమస్యను త్వరలోనే భారతీయ జనతా పార్టీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రవికుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించిన తర్వాతే పనులపై నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో జరిగిన చర్చల అనంతరం నాలా పనులను తాత్కాలికంగా నిలిపివేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి,

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం,

అధికారులు--ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా అభివృద్ధి వేగవంతం

రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలి,

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు,



లోకల్ గైడ్ నాగర్కర్నూల్ జిల్లా :ప్రజా పాలనలో నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేసి, నాగర్ కర్నూలు జిల్లాకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు.ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజా పాలనను ఆదర్శంగా నిలపాలని మంత్రి ప్రజా ప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు.శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా జిల్లా కేంద్రంలోని గగ్గలపల్లి తేజ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాస్థాయి ప్రజా పాలన సమావేశాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్



హేమంత కేశవ్ పాటీల్ శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశాన్ని ప్రారంభించారు.ముందుగా తెలంగాణ జాతీయ గీతాలాపనతో ప్రారంభమైన కార్యక్రమం అనంతరం,జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో మార్చ్ 6 నుంచి అమల చేసిన కార్యక్రమాలపై ఈ అవగాహన సదస్సులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పది అంశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పై అధికారులు శాఖల వారీగా తెలియపరిచారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ......, ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని, మహిళల ఆర్థిక అభివృద్ధిని పెంపొందించే విధంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనేక కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.ఉమ్మడి పాలమూరు జిల్లా రైతుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.గత ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రంపై భారీ అప్పుల భారం పడిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత పదేళ్లలో రూ. 8 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని మంత్రి ఆరోపించారు. ఈ అప్పుల కారణంగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 6500 కోట్ల వరకు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. గతంలో 22 మంది ముఖ్యమంత్రులు 64 సంవత్సరాల పాలనలో మొత్తం రూ. 65 వేల కోట్ల అప్పులు మాత్రమే చేశారని, కానీ గత ప్రభుత్వం కేవలం పదేళ్ల వ్యవధిలోనే భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి పెట్టిందని మంత్రి తెలిపారు.రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. అదేవిధంగా, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ సామాన్య ప్రజలకు ఊరటనిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించేందుకు రూ. 500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టామని, అర్హులైన కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గృహరహిత పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా స్వంత ఇల్లు కల కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నామని, రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. అదనంగా, సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని జూపల్లి కృష్ణారావు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంను ప్రారంభించేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంచ్ అనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, జూన్ రెండో తేదీన ఒక లక్ష ఇండ్లు గృహప్రవేశాలు జరగనున్నాయని, ముఖ్యమంత్రి అదిలాబాదులో గృహప్రవేశాల కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు మంత్రి తెలిపారు. పాలమూరు ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా సాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఈ ప్రాంత రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలంటే పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కీలకమని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పనులు నెమ్మదించాయని ఆయన విమర్శించారు.ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినప్పటికీ, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, కానీ గత పాలకులు పాలమూరు ప్రాంత రైతుల అవసరాలను పట్టించుకోలేదని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సాగునీటి వనరుల విస్తరణతో పాటు, ఎండబారిన భూములకు నీరు అందించి రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడమే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి పథకం పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, తాగునీటి సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని వివరించారు.శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ,........ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రజాప్రతినిధులు మరియు అధికారులు వారధిగా పని చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు జిల్లాలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మార్చి 6వ తేదీ నుంచి జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించారని కలెక్టర్ ప్రశంసించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 5,000 ఫైళ్లను రానున్న 15 రోజుల్లో పూర్తిస్థాయిలో క్లియరెన్స్ చేసే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం ప్రతి ప్రభుత్వ అధికారుల బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు."ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవా దృక్పథంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు సాకారం అవుతాయని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి తదితర ప్రజా ప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గీతంలో 'టాక్ టైమ్' మార్గదర్శన కార్యక్రమం

-విద్యార్థుల సాధికారతకు టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ




పఠాన్ చేరు, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల విద్యా, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో 'టాక్ టైమ్' పేరుతో ప్రత్యేక మార్గదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం వృత్తిపరమైన సలహాల కేంద్రం (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 మే 11 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4.00 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యార్థులతో 15 నిమిషాల వ్యక్తిగత సమావేశాలు నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు మినహా అన్ని పనిదినాలలో ఈ సెషన్లు అందుబాటులో ఉంటాయి. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ సంసిద్ధత, వృత్తి మార్గదర్శనం, వ్యక్తిగత ఆందోళనలు వంటి అంశాలపై విద్యార్థులు స్వేచ్ఛగా చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడనుంది. తమ సందేహాలను నివృత్తి చేసుకుని, విద్యా, కెరీర్‌కు సంబంధించిన నిర్ణయాలలో స్పష్టత పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని డాక్టర్ రోజీనా మాథ్యూ తెలిపారు. స్లాట్లు పరిమితంగా ఉండటంతో విద్యార్థులు ముందస్తుగా క్యూఆర్ కోడ్ లేదా వెబ్ లింక్ ద్వారా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాలని ఆమె సూచించారు.

# ప్రజా ప్రభుత్వంలో జూన్ 2 పండుగ వాతావరణం

-పలు సంక్షేమ పథకాల ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధం

-సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనకు కొత్త దిశ

-సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు, ప్రీతం




శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2ను ప్రజా ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేస్తోంది. ప్రజలకు నేరుగా ఉపయోగపడే పలు సంక్షేమ పథకాలను అదే రోజు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యంగా పేదల సంక్షేమం, ఉద్యోగుల భద్రత, కుటుంబ రక్షణ, గృహ కలల సాధన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు, ప్రీతం మాట్లాడుతూ..ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలలో కొత్త ఆశలు నింపుతున్నాయని పేర్కొన్నారు.జూన్ 2న ప్రారంభం కానున్న పథకాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది పెద్ద ఊరటనిస్తుందని అభిప్రాయపడ్డారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఇప్పటికే మొదటి విడతలో లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతుండగా, జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పించే దిశగా హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఉద్యోగులు మెరుగైన వైద్య సేవలు సులభంగా పొందేందుకు ఈ హెల్త్ కార్డులు ఉపయోగపడనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు సమాచారం. కుటుంబ పెద్ద అనుకోని పరిస్థితులలో మరణించినా కుటుంబానికి ఆర్థిక రక్షణ అందించే విధంగా ఈ పథకం రూపుదిద్దుకుంటోందని తెలుస్తోంది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా కొత్త అప్లికేషన్ల స్వీకరణకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన ప్రజలకు మరో అవకాశం కల్పించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు వెళ్లినట్లు తెలిసింది. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. జూన్ 2న ప్రారంభమయ్యే కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనున్నాయని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్య ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పులు తీసుకువస్తాయని వారు అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కాంగ్రెస్ దగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ

నారాయణపేట మే 22: రైతు పండించిన ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ ఒక ప్రకటనలో విమర్శించారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు.ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్మకానికి తీసుకువస్తే అధికారులు తాలు అంటూ తూకంలో మోసం చేస్తూ రైతులకు అనేక కొర్రీలు పెడుతున్నారని అన్నారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువస్తే అక్కడ గన్ని బ్యాగుల కొరత, ఆన్ లోడ్ చేయడానికి లారీల కొరత ఉందని అన్నారు.దాంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు.విక్రయించిన రైతులకు బోనస్ దేవుడెరుగు కానీ అసలు డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు.దాంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగమేనని అన్నారు.కానీ ప్రభుత్వం మాత్రం వేల కొలది క్వింటాళ్ల ధాన్యం కొన్నామని రైతుల ఖాతాలో బోనస్ తో పాటు డబ్బులు జమ చేశామని ప్రకటనలు చేస్తున్నదని అన్నారు.వాస్తవ పరిస్థితి అందుకు బిన్నంగా ఉండడంతో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులకు న్యాయం చేయకపోతే బిజెపి ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

# మాదారం సర్పంచ్ ఉమా నరేష్ కృషి , పట్టుదల , ఎమ్మెల్యే సహకారం గ్రామాభివృద్ధికి తొడ్పాటు

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు

-సర్పంచ్ కు ప్రజలు ప్రత్యేక అభినందనలు

ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 22 : వైరా నియోజకవర్గం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చొరవతో మాదారం సీ సీ డ్రైనేజీ వ్యవస్థ కు నిధుల మంజూరు చెయ్యడం జరిగింది. మాదారం గ్రామం లో ప్రతి సంవత్సరం వర్ష కాలంలో సీజన్ లో ప్రజలు నీరు రహదారులపై నిల్వ ఉండడం వల్లనా ప్రజలు ఆరోగ్యం విషయం లో తీవ్ర ఇబ్బందులు పడుతూ హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంధులు పడుతూ ఉంన్నారని గ్రహించిన సర్పంచ్ ఉమారాణి నరేష్ ప్రత్యేక చొరవతీసుకొని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు సమస్య పై అభ్యర్థించగా వెంటనే స్పందించి న ఎమ్మెల్యే ప్రతిపాదనలు వేయించి జిల్లా కలెక్టర్ ద్వారా జడ్పీ నిధుల నుండి 19 లక్షల రూపాయలను మంజూరు చేయించి, పనులను రానున్న వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకోని నిర్లక్ష్య ధోరణి చూపకుండా త్వరగతిగా పూర్తిచేయ్యాలని అధికారులకు, సర్పంచ్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. సర్పంచ్ ఉమారాణి నరేష్ గ్రామ పంచాయతీ కీ చేస్తున్న అభివృద్ధి పనులకుగాను గ్రామ ప్రజలు అభినందనలతో శు భాకాంక్షలు తెలిపినారు. అలాగే ఇటీవల మొక్క జొన్న రైతుల సమస్య ను గుర్తించి మంత్రి, ఎమ్మెల్యే సహకారం తో కొనుగోలు కేంద్రాన్ని గ్రామ పంచాయతీ లో నెలకోప్పడం జరిగింది.మాదారం గ్రామ పంచాయతీ అభివృద్ధికై కృషి, పట్టుదలతో ముందుకు నడుస్తున్న సర్పంచ్ కు మండల నాయకులు, సర్పంచ్ లు ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది.

# బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి కౌన్సిలర్ కాకర్ల



నారాయణపేట మే 22లోకల్ గైడ్, :నారాయణపేట పట్టణంలోని మూడో వార్డుకు చెందిన మహబూబ్ అలీ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవాలని వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం ఈదురుగాలులకు మహ బూబ్ అలీ ఇంటి పైకప్పు పూర్తిగా గాలి వర్షానికి కొట్టు కపోవడంతో ఆ కుటుం బం రోడ్డున పడిందని ఆమె తెలి పారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుం బాన్ని ఆదుకోవాలని అన్ని డిమాండ్ చేశారు.ఆ నిరుపేద కుటుంబం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తూ గాలి వర్షానికి తమ ఇంటి పై కప్పు పూర్తిగా కూలిపోవ డంతో వారిని ప్రభుత్వం గుర్తించి వారిని ఆదుకోవా లన్నారు.జిల్లా కలెక్టర్ స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రఘు రామయ్య ను సన్మా నించిన బిజెపి నాయకులు



నారాయణపేట మే 22: రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడుగా నియమితులైన కే.రఘు రామయ్య గౌడ్ ను శుక్రవారం నారాయణపేట లోని ఆయన నివాసంలో బిజెపి పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,మున్సిపల్ కౌన్సిలర్ కే.ప్రభాకర్,పట్టణ బిజెపి కోశాధికారి హన్మంతు రావు,ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు ఉమాకాంత్ శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రఘు రామయ్య గౌడ్ మాట్లాడుతూ మీ అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాదారం సర్పంచ్ ఉమా నరేష్

కృషి , పట్టుదల , ఎమ్మెల్యే సహకారం గ్రామాభివృద్ధికి తొడ్పాటు

-ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు

-సర్పంచ్ కు ప్రజలు ప్రత్యేక అభినందనలు



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 22 : వైరా నియోజకవర్గం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చొరవతో మాదారం సీ సీ డ్రైనేజీ వ్యవస్థ కు నిధుల మంజూరు చెయ్యడం జరిగింది. మాదారం గ్రామం లో ప్రతి సంవత్సరం వర్ష కాలంలో సీజన్ లో ప్రజలు నీరు రహదారులపై నిల్వ ఉండడం వల్లనా ప్రజలు ఆరోగ్యం విషయం లో తీవ్ర ఇబ్బందులు పడుతూ హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంధులు పడుతూ ఉంన్నారని గ్రహించిన సర్పంచ్ ఉమారాణి నరేష్ ప్రత్యేక చొరవతీసుకొని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు సమస్య పై అభ్యర్థించగా వెంటనే స్పందించి న ఎమ్మెల్యే ప్రతిపాదనలు వేయించి జిల్లా కలెక్టర్ ద్వారా జడ్పీ నిధుల నుండి 19 లక్షల రూపాయలను మంజూరు చేయించి, పనులను రానున్న వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకోని నిర్లక్ష్య ధోరణి చూపకుండా త్వరగతిగా పూర్తిచేయ్యాలని అధికారులకు, సర్పంచ్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. సర్పంచ్ ఉమారాణి నరేష్ గ్రామ పంచాయతీ కీ చేస్తున్న అభివృద్ధి పనులకుగాను గ్రామ ప్రజలు అభినందనలతో శు భాకాంక్షలు తెలిపినారు. అలాగే ఇటీవల మొక్క జొన్న రైతుల సమస్య ను గుర్తించి మంత్రి, ఎమ్మెల్యే సహకారం తో కొనుగోలు కేంద్రాన్ని గ్రామ పంచాయతీ లో నెలకోప్పడం జరిగింది.మాదారం గ్రామ పంచాయతీ అభివృద్ధికై కృషి, పట్టుదలతో ముందుకు నడుస్తున్న సర్పంచ్ కు మండల నాయకులు, సర్పంచ్ లు ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది.

# సత్తుపల్లి :పట్టణం - ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయం లో - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో



సత్తుపల్లి మండలం, వేంసూరు మండలం మరియు పెనుబల్లి మండలం చెందిన రైతులకు " రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు " పంపిణీ చేసిన... సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ .. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, వ్యవసాయ శాఖ అధికారులు సత్తుపల్లి , పెనుబల్లి, వేంసూరు మండలం ఏ ఈ , ఏవో లు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలం రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు పాల్గొన్నారు..

# ఏకో టౌన్షిప్ కు అనుమతులు ఇవ్వద్దు

షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సిద్దాపూర్ లో డంపు యార్డు ప్రతిపాదన విరమించుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే

హాజరైన కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, సిద్దాపూర్ సర్పంచ్ విస్లావత్ బాసు నాయక్



( లోకల్ గైడ్ షాద్ నగర్)కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులో ఏకో టౌన్షిప్ పేరుతో భారీ చెత్త డంపు యార్డు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పంచాయతీరాజ్ శాఖ జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ఎకో టౌన్షిప్ కు వ్యతిరేకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్నగర్ నియోజకవర్గానికి హైదరాబాద్ జంట జలాశయాలకు అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. సిద్దాపూర్ పరిసర ప్రాంతాల చెరువులు, కుంటలు గొలుసు కట్టు మాదిరిగా ఉండి వరద నీరు జంట జలాశయాల్లో, మూసీ నదిలో కలుస్తుందని భౌగోళిక పరిస్థితులను వివరించారు. ఇక్కడ చెత్తను డప్పు చేయడం వల్ల వ్యర్థాలు నాలాల్లో కలిసి చెరువులు, కుంటలను కలుషితం చేస్తూ చివరకు హిమాయత్ సాగర్, గండిపేట చెరువుల్లో కలిసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పైగా స్థానిక పల్లె జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి చోట కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు తీసుకుని, చెత్త డంపు కోసం ప్రయత్నాలు సాగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త డంపు కేంద్రం నుంచి సుమారు పది కిలోమీటర్ల పరిధిలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దాపూర్ గ్రామానికి అనుకొని ఉన్న మహేశ్వరం మండలం, కందుకూరు ఫ్యూచర్ సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, సిద్దాపూర్ గ్రామ సర్పంచ్ విస్లావత్ బాసు నాయక్,ఎస్బి పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

# నడిగడ్డ తాండలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

-శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, కొత్త మీటర్ల మంజూరుకు డిమాండ్



శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ నడిగడ్డ తాండలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏఈ మాధురికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ..తాండాలో గతంలో ఏర్పాటు చేసిన అనేక విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వంగిపోయి ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో ఇవి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున, వాటి స్థానంలో వెంటనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొన్ని విద్యుత్ స్తంభాలు నివాస గృహాల లోపల ఉండటం వల్ల ప్రజలు ఇళ్ల నిర్మాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ స్తంభాలను తొలగించి రోడ్డు పక్కన సక్రమంగా లైన్‌లోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. తాండాలో ఇప్పటికీ కొన్ని ఇండ్లకు విద్యుత్ మీటర్లు లేకపోవడంతో అర్హులైన కుటుంబాలకు వెంటనే కొత్త మీటర్లు మంజూరు చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా కల్పించాలని కోరారు. అధికారులు పరిశీలించి తాండాలోని అన్ని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఏఈ మాధురి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తాండ అధ్యక్షులు సభవత్ హన్మ నాయక్, ఎం.రెడ్యానాయక్, ఇస్లావత్ దశరథ్ నాయక్, నాయిని రత్నకుమార్, కాట్రావత్ శంకర్ నాయక్, అంగోత్ మోతిరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందంజ

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం, మే-22:లోకల్ గైడ్ :ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు.ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు.ఖమ్మం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశుధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య చర్యలతో సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చని పేర్కొన్నారు.మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు చెప్పారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అంతకు ముందుకు ఖమ్మం జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను వెల్లడించారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లిలో వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రత శిక్షణ

-110 మంది విక్రేతలకు శిక్షణ పూర్తి ధ్రువపత్రాలు..పరిశుభ్రత కిట్ల పంపిణీ





శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రత్యేక ఆహార భద్రత శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ అదనపు కమిషనర్ (యూబీడీ) సుభద్రదేవి, శేరిలింగంపల్లి జోన్ ఆహార భద్రత అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 నిబంధనల ప్రకారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో వీధి ఆహార విక్రేతలకు సురక్షిత ఆహార తయారీ, ఆహార పదార్థాల నిల్వ విధానం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిశుభ్రమైన వంట పద్ధతులు, వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై నిపుణులు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలకు అందించే ఆహారం నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఆహార విక్రయంలో పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ప్రతి విక్రేత ఆహార భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొత్తం 110 మంది వీధి ఆహార విక్రేతలు పాల్గొని ఆహార భద్రత పర్యవేక్షకుల కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. శిక్షణ అనంతరం వారికి శిక్షణ పూర్తి ధ్రువపత్రాలు అందజేయడంతో పాటు పరిశుభ్రత కిట్లను పంపిణీ చేశారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రజలలో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నెస్లే ఇండియా, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి ఆహార విక్రేతల్లో ఆహార భద్రతపై మరింత బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మొగ్దుంపూర్ - జక్లేర్ బస్సు పునః ప్రారంభం పట్ల హర్షం



నారాయణపేట మే 22:నారాయణ పేట డిపో నుండి మొగ్ధంపూర్ - జక్లేర్ బస్సు పునః ప్రారంభం పట్ల ప్రయా ణికులు హర్షం వ్యక్తం చేశారు.గత నెల రోజుల నుండి ఈ బస్సు బంద్ కావడం వలన సామజిక కార్యకర్త హెచ్. నర్సింహా మరియు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రయాణి కులు డి యం ను కలిసి వినతి పత్రాలు సమర్పించా రు. ఈ సందర్భంగా డి యం పాఠశాలల పిల్లల కోసం వేసి న బస్సు కావున పాఠశాలలు ప్రారంభం అయిన తర్వాత బస్సు వేస్తాం అంటే సామా జిక కార్యకర్త హెచ్. నర్సింహా ఈ బస్సు ఎన్నో సంవత్స రాల నుండి ప్రయాణికుల కోసం వేసిందని డిపో మేనే జర్ లావణ్య దృష్టికి తీసికొని పోయారు.అప్పుడు డి యం వాస్తవాలు తెలుసుకొని మార్చ్, ఏప్రిల్ నెలల కలక్షన్ చూసి బస్సు పునః ప్రారంభం చేస్తామని చెప్పారు. అన్ని పరిశీలించి ప్రయాణికుల, విద్యార్థుల ఇబ్బందులు అర్థం చేసుకొని ఈ బస్సు ను పునః ప్రారంభం చేసినందుకు ఆర్ టి సి అధికారులకు, డిపో మేనేజర్ కు అందరూ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## శ్రీ లోకపల్లి లక్ష్మమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా జి.శశికాంత్ యాదవ్



నారాయణపేట మే 22: నారాయణపేట మండలం లోకాపల్లి శ్రీ లక్ష్మమ్మ ఆలయ నూతన కమిటీ నీ శు క్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆలయ కమిటీ నూతన అధ్యక్షునిగా శశికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కూరగాయల రవికుమార్ గౌడ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. భవిష్యత్తులో శ్రీ శ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం అనేక ఏర్పాట్లు, భక్తి రంజకమైన కార్యక్ర మాలను చేపడుతామని ఇట్టి అవకాశం కల్పించిన సభ్యులందరికీ ఆలయ కమిటీ అధ్యక్షులు శశికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు కూరగాయల రవికుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు ఆలయ గౌరవ అధ్యక్షుడు హరినారాయణ భట్టడా అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో 2025బి3026 వార్షిక ఆదాయ వ్యయాలని కోశాధికారి లప్ప అశోక్ చదివి వినిపించగా ఆమోదించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆంజనేయస్వామి శిఖర నిర్మాణమునకు లక్ష విరాళం అందించిన నారాయణపేట గాల సిద్ధమ్మ ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఉపాధ్యక్షులు కన్నా జగదీష్ , ప్రధాన కార్యదర్శి, వేముల మధుసూదన్ రెడ్డి, కోశాధికారి లప్ప అశోక్ , సహకార దర్శి ఆర్ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, కమిటీ ఈ సి సభ్యులు పిల్లి నరసింహులు, సంతోష్ నామాజీ, కమిటీ సలహాదారుడు ఆత్మరాం హెడ్కె, మరియు మహిళా కమిటీ సభ్యులు సంధ్యారాణి వెంకటరమణ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల గోస ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి-చలసాని విష్ణుమూర్తి.



రాజేంద్ర నగర్, ( లోకల్ గైడ్ ): రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఎంతో కష్టపడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తుందని టి ఆర్ ఎస్ (తెలంగాణ రక్షణ సేన ) పార్టీ రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జీ చలసాని విష్ణుమూర్తి ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పరిస్థితి అత్యంత దయానీయంగా ఉందన్నారు. శుక్రవారం అయన ఓ ప్రకటనలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం అత్యంత దుర దృష్టకరమన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తరలించిన 50% కూడా కొనుగోలు చేయకపోగధాన్యం నాణ్యతా ప్రమాణాల పేరుతో, ఆరబెట్టిన ధాన్యంపై కూడా 'తేమ ఎక్కువ ఉంది' అని సాకు చెబుతూ క్వింటాలుకు 5 నుండి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ?కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం త్రాగునీరు, నిలవనీడ లేక రైతులు, కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల భయంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవన్నారు. ?ఒకవేళ ధాన్యం విక్రయించినా, రైతు ఖాతాల్లోకి డబ్బులు ఎప్పుడు జమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సన్న రకం వరిని పండించే రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ చేయాలన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, అవసరమైనంత మేర గన్నీ బ్యాగలు అందించడంతో పాటు రైతులను వేధించే మిల్లర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను కూడా గట్టుకొని ఆందోళనలను చేస్తామన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



నారాయణపేట మే 22: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధితో పాటు దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన లక్ష్యమని రాష్ట్ర పాడి పరిశ్రమ, యువజన క్రీడలు,మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.శు క్రవారం నారాయణపేట జిల్లా కేంద్రం లోని ఒక ఫంక్షన్ హాల్ లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా సంక్షేమం,దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగులఅభివృద్ధి,సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమా లు అమలు చేస్తోందని తెలి పారు. కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు దివ్యాంగుల జీవితాల్లో మరింత ఆత్మ విశ్వాసాన్నిపెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. దివ్యాం గుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దన్నలా, ఆత్మీయ బంధు వులా అండగా నిలుస్తున్నా రని తెలిపారు.తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాం గులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల వివాహ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని పేర్కొన్నారు.ఐదు సంవత్స రాల లోపు దివ్యాంగ చిన్నా రులకు శస్త్ర చికిత్సలు నిర్వ హించి సాధారణ జీవితం గడిపేలా చేయడం కోసం "బాల భరోసా" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకర ణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభు త్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అంది స్తున్న ఉపకరణాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభు త్వం తరఫున అందించబ డతాయని తెలిపారు. దివ్యాంగ మహిళలు తప్పని సరిగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లలో చేరాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ మాట్లా డుతూ దివ్యాంగులకు అంది స్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హు లైన ప్రతి దివ్యాంగునికి సహా య పరికరాలు అందజేస్తా మని, ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎస్. శ్రీను,ఆర్డీఓ ఎల్. రమేష్ , డీపీవో సుధాకర్ రెడ్డి , ఇతర జిల్లా అధికా రులు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి, లబ్ధిదారులు, దివ్యాంగులు,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్య లోపాల్గొ న్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ ప్లీడరు భూక్య మంగీలాల్



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్,మే 22 : సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామం లో హై కోర్ట్ న్యాయవాదిగా పనిచేస్తున్న భూక్య గణేష్ సింధుజ దంపతులను దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ న్యాయవాది భూక్య మంగీలాల్ గణేష్ స్వగృహం నందు శాలువతో సత్కరించి ఆశీర్వదించడం జరిగింది . ఈ సందర్భంగా భూక్య మంగీలాల్ జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి గిరిజనుల ఖ్యాతిని పల్లె నుండి పట్టణానికి విస్తరింపజేసి , న్యాయస్థానంలో సుస్థిరమైన స్థానాన్ని ప్రత్యేకతలు పెంపొందించుకోవాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఇల్లందు కోర్టు న్యాయవాది మాలోత్ శ్యామ్ సుందర్ లాల్ ,ఆజ్మీర నాగేంద్రబాబు , నందు నాయక్ , శారదబాయి , తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తు పదార్థాలు సేవించిన లేదా విక్రయించిన కఠిన చర్యలు తప్పవు

బస్టాండు, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలను డాగ్స్ స్క్వాడ్ తో తనిఖీలు

సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే22 (లోకల్ గైడ్ తెలంగాణ) సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలలో తోపాటు రద్దీగా ఉండే ప్రదేశాలలో నార్కోటిక్ బృందం సుల్తానాబాద్ పోలీసులు సంయుక్తంగా యాంటీ నార్కోటిక్స్ డాగ్ స్కాడ్ తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించిన అనంతరం సీఐ మాట్లాడుతూ, గంజాయి ఇతర



మత్తు పదార్థాలు సేవించిన విక్రయించిన రవాణా చేపట్టిన తీవ్ర పరిణామాలు ఉంటాయని వాటిని ఎవరు సేవించవద్దని వాటికి దూరంగా ఉండాలని కాదని ఎవరైనా విక్రయించిన సేవించిన వివిధ పరీక్షల ద్వారా వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎట్టి పరిస్థితిలో ఎవరిని ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. రైస్ మిల్లు ఇటుక బట్టి యజమానులు వ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎవరైనా గంజాయి మొక్కలను పెంచితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలందరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రకుమార్,అదనపు ఎస్సై అశోక్ రెడ్డి, నార్కోటిక్, డాగ్ స్క్వాడ్ బృందం తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 18న చేపట్టిన పైప్‌లైన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం

-పాపిరెడ్డి నగర్ లో మంచినీళ్లలో మురుగునీరు కలిసి వస్తుందని ఆందోళన

-వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్ రెడ్డి విజ్ఞప్తి





శేరిలింగంపల్లి, మే 22 (తరణం ప్రతినిధి కృష్ణ): పాపిరెడ్డి నగర్ కాలనీలో ఫిబ్రవరి 18న చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులు నాణ్యత లేకుండా నిర్వహించారని కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయి నెలలు గడిచినా ఇప్పటికీ రోడ్డును సక్రమంగా పునరుద్ధరించకపోవడంతో కార్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. అదేవిధంగా, ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ నాసిరకంగా ఉండటంతో పగిలిపోవడం జరిగిందని, దీనివల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. కాలనీ ప్రజల సమస్యలను వెంటనే పరిశీలించి, పనుల నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులైన ఏఈ పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. సమస్యను అధికారులు పట్టించుకోకపోతే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. పాపిరెడ్డి నగర్‌లో మంచినీళ్లలో మురుగు నీరు కలిసివస్తోందని ఆందోళన వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్ రెడ్డి విజ్ఞప్తి పాపిరెడ్డి నగర్ ప్రాంతంలో మంచినీటి సరఫరాలో మురుగు నీరు కలిసివస్తోందని కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్య వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు రేపు ఉదయం ప్రాంతానికి వచ్చి పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ సమస్య కారణంగా ఎవరికైనా అనారోగ్యం లేదా ఇతర ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది అని పాపిరెడ్డి నగర్ కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత పరిష్కారం చూపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఏజెన్సీలో చిరుత సంచారం.. పాదముద్రలు గుర్తింపు వెంకటాపురం-చర్ల సరిహద్దుల్లో అటవీశాఖ తనిఖీలు

రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని హెచ్చరిక




ములుగు జిల్లా, వెంకటాపురం : లోకల్ గైడ్ :ములుగు జిల్లా వెంకటాపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానికంగా కలకలం రేగింది. ఎదిరాగుట్టలు, యాకన్నగూడెం, సుబ్బంపేట ప్రాంతాల పరిసరాల్లో చిరుత తిరుగుతున్నట్లు గ్రామస్తులు తెలియజేయడంతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చిరుతకు చెందినట్లుగా అనుమానాస్పద పాదముద్రలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చిరుత సమీప అటవీ ప్రాంతాల వైపు కదులుతున్నట్లు భావిస్తూ అటవీ విభాగం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అడవి అంచు ప్రాంతాల్లో పశువులు, గొర్రెల మేపుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ఒంటరిగా సంచరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ చిరుత కనిపించినట్లయితే దానికి ఎలాంటి హాని తలపెట్టకుండా వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం వన్యప్రాణులకు హాని కలిగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## కృష్ణ పోలీస్ స్టేషన్ లో చలివేంద్రం ఏర్పాటు




నారాయణపేట మే 22:నారాయణ పేట జిల్లా క్రిష్ణ మండలం పోలిస్ స్టేషన్ లో భీమ్ సేన సేవా సమితి సంఘం ఆధ్వర్యం లో చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలి వేంద్రాన్ని శుక్రవారం క్రిష్ణ మండలం ఎస్ ఐ నవీద్ ప్రారంభించారు.ఈ భీమా కార్యక్రమంలో ఏ ఎస్సై సురేందర్ వ్యవస్థాపకులు యాంకే నాగేశ్వర్, రాష్ట్ర కన్వీనర్ హాజీబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి గౌడ్ ,వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, కార్య దర్శి ,ఖాసీం ఆలీ,కృష్ణ మండలం గ్రామ పంచాయతీ సెక్రెటరీ నర్సింలు , నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెస్ ఎన్ కలిసిన బంగ్లా



నారాయణపేట మే 22:ఎమ్మెస్ఎన్ ఫార్మా ఫౌండర్ మన్య సత్యనారాయణ రెడ్డి నీ బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి శుక్రవారంమర్యాదపూర్వకంకలసి పుష్పగుచ్ఛం అందజేసారు.ఈ సందర్భంగా ఆయన ఈ ప్రస్త నిరుద్యోగ యువతకు చేయూత ఇవ్వాలని కోరారు.

## నడిగడ్డ తాండలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

–శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, కొత్త మీటర్ల మంజూరుకు డిమాండ్



శేరిలింగంపల్లి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ నడిగడ్డ తాండలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏఈ మాధురికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ..తాండాలో గతంలో ఏర్పాటు చేసిన అనేక విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వంగిపోయి ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో ఇవి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున, వాటి స్థానంలో వెంటనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొన్ని విద్యుత్ స్తంభాలు నివాస గృహాల లోపల ఉండటం వల్ల ప్రజలు ఇళ్ల నిర్మాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ స్తంభాలను తొలగించి రోడ్డు పక్కన సక్రమంగా లైన్‌లోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. తాండాలో ఇప్పటికీ కొన్ని ఇండ్లకు విద్యుత్ మీటర్లు లేకపోవడంతో అర్హులైన కుటుంబాలకు వెంటనే కొత్త మీటర్లు మంజూరు చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా కల్పించాలని కోరారు. అధికారులు పరిశీలించి తాండాలోని అన్ని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఏఈ మాధురి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తాండ అధ్యక్షులు సభవత్ హన్మ నాయక్, ఎం.రెడ్యానాయక్, ఇస్లావత్ దశరథ్ నాయక్, నాయిని రత్నకుమార్, కాట్రావత్ శంకర్ నాయక్, అంగోత్ మోతిరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిపారసుతో మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందచేత



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో కేశంపేట్ మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన కే. శ్రీశైలం,పుట్టోని గూడ గ్రామానికి చెందిన బి.నర్సింహులు, కొత్తపేట గ్రామానికి చెందిన ఎం.యాదగిరి,డి.రజిత,సంతాపూర్ గ్రామానికి చెందిన ఎన్ .మల్లేష్, కాకనూర్ గ్రామానికి చెందిన కే .శివశంకర్, ఎక్లాస్ ఖాన్ పేట గ్రామానికి చెందిన కే. దిపాల్, బైర్కాన్ పల్లి గ్రామానికి చెందిన సి.జంగయ్య మరియు ఎస్ .లక్ష్మి తదితరులకు మంజూరైన 2,86,500 విలువగల చెక్కులను కేశంపేట మండల సర్పంచులు మరియు బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు వారి గ్రామంలో అందచేశారు.ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి కాకనూర్ సర్పంచ్ బుడ్డోళ్ల రాజు బైఖాన్ పల్లి సర్పంచ్ బైకాని శమంతా యాదయ్య మాజీ సర్పంచ్ లు తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి, కాంలేకర్ నవీన్ కుమార్,యాదగిరి రావు ప్రభాకర్ రెడ్డి,గంగ్ర లక్ష్మమ్మా కృష్ణయ్య,జగన్ నాయక్, జరుపుల రాజు నాయక్ మాజీ ఎంపీటీసీ రమాదేవి కోటేశ్వర్ బిఆర్ఎస్ నాయకులు యాదయ్య యాదవ్ తుకారాం నాయక్ శివ యాదవ్ జగన్ రెడ్డి కృష్ణ అశోక్ సిమల శ్రీనివాస్ సూరమోని శంకర్ మొటే పార్వతలు శ్రీశైలం ఆంజనేయులు అల్వాల శేఖర్ మరియు ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్



( లోకల్ గైడ్ షాద్ నగర్)జూన్ 13, 14 తేదీలలో షాద్నగర్‌లో జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా షాద్నగర్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ మాట్లాడుతూ జిల్లాలో రియల్ ఎస్టేట్ పేరుతో పేదల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు దున్నుతున్న భూములకు హక్కులు కల్పించాలని, ఇల్లు లేని పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజలపై భారాలు మోపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చే దిశగా పనిచేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ మరియు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఆసరా, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కార్మికుల కోసం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు.రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత దగ్గరగా పనిచేయడానికి ఈ జిల్లా మహాసభలను షాద్నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ జంగయ్య, కాకి రమేష్, సహాయ కార్యదర్శులు కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు



నారాయణపేట మే 22:సామాజిక సంస్కర్త, దళితో ద్యమ ప్రముఖ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను జ్యోతి ప్రజ్వలన చేసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా అద నపు కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్న తికి విశేషంగా కృషి చేశారని అన్నారు. విద్య, సామాజిక సమానత్వం, హక్కుల సాధ న కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యే ప్రధాన ఆయుధమని భావిం చి, వారికి చైతన్యం కల్పించేం దుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు.భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావన తో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో ఈ డి.ఎస్.సి. కార్పొ రేషన్ అబ్దుల్ ఖలీల్, డి.వై.ఎస్.ఓ.వెంకటేశ్ శెట్టి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజల అర్జీలని సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలి

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు :

వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం :

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి..







వనపర్తి లోకల్ గైడ్ మే 22 :(అంబటిస్వామిప్రతినిధి ): దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ని సమావేశ మందిరం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉన్నారు. ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గం లో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు తోడుగా అదనంగా మరిన్ని పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. విద్యా, వైద్యంపై ప్రధాన దృష్టి సారించి, వీటికి ప్రధానంగా నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రజల అర్జీలను, దరఖాస్తులను వేగంగా



పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వాటిని వేగంగా పరిష్కరించాలని తెలిపారు. ఎటువంటి సమస్య లేకుండా భూభారతి కి సంబంధించి రైతుల నుంచి వచ్చే అర్జీలను శరవేగంగా పరిష్కరించాలని ఆయన సూచించారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు పరిమితులకు లోబడి ఇండ్లను నిర్మించుకోవాలని, పరిమితికి మించి ఇండ్ల నిర్మాణం చేసుకోవడం ద్వారా తిరిగి అప్పులపాలయ్యే అవకాశం ఉంటుందని ఆ దిశగా అధికారులు పర్యవేక్షణ సాగించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ప్రతి వ్యక్తికి సరైన సమాచారం అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో 65 ఏళ్లలో కేవలం రాష్ట్ర అప్పు రూ. 65 వేల కోట్లు ఉంటే, గత ప్రభుత్వం పది ఏళ్లలో 8 లక్షల కోట్ల అప్పు చేసిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. యువత పక్కదారి పట్టకుండా, డ్రగ్స్ వైపు మల్లకుండా క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో బాగా పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సంతకం మహిళా శక్తి పథకంపై చేశారని తెలిపారు. తద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పదివేల కోట్లలు మహిళా శక్తి పథకం కోసం మహిళల ప్రయాణం కోసం ఖర్చుపెట్టిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును గృహ జ్యోతి పథకం కింద ప్రభుత్వం పేదలకు అందించి పేదలకు కరెంటు కష్టాలు తీర్చిందని తెలిపారు. అదేవిధంగా గత పది సంవత్సరాలలో ఎన్నడూ ఒక రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, రేవంతన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వనపర్తి జిల్లాలో 73 వేల కొత్త రేషన్ కార్డులను అందించామని తెలిపారు. రైతు భరోసా పెట్టుబడి సాయం కింద గతంలో ఎకరాకు పదివేలు ఇస్తే, ఇప్పుడు దాన్ని ఎకరాకు 12 వేలకు పెంచామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు బాధ్యతలు మహిళలకు అప్పజెప్పడం జరిగిందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో 200 కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట...

# అట్టహాసంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి వేడుక

సమిష్టి కృషితో సత్వర ప్రగతి సాధిద్దామని ఎమ్మెల్యేల పిలుపు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విధులు, అధికారాలపై కలెక్టర్ దిశానిర్దేశం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 22 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్ లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జయజయహే తెలంగాణా గేయాలాపనతో సమావేశానికి శ్రీకారం చుట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.



వివిధ శాఖల జిల్లా అధికారులు తమతమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి నివేదిక చదివి వినిపించారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నాలకు బోనస్ చెల్లింపు, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర పథకాల అమలు వల్ల జిల్లాలో ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలను వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నుండి ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న అల్పాహారం పథకం, ఇంటర్మీడియట్ కాలేజీలలో సైతం మధ్యాహ్న భోజనం అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు తదితర అంశాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గడిచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రగతి, ఇకముందు చేపట్టబోయే అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేస్తూ పాలనలో వారిని భాగస్వాములు చేయాలనే సంకల్పంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. 99 రోజుల స్పష్టమైన కార్యాచరణతో గ్రామ స్థాయి నుండి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, ప్రజలను భాగస్వాములు చేసి సమిష్టిగా కృషి చేసినప్పుడే సత్వర ప్రగతి సాధ్యపడుతుందని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి దిశగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పంటల సాగులో క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించినవారు అవుతారని అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ, అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే తపనతో మొదటి విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేశారని, త్వరలోనే రెండవ విడతగా ఇందిరమ్మ



ఇళ్ళను మంజూరు చేయనుందని, నిబంధనలను సైతం సడలించడం జరిగిందని వివరించారు. రైతులను ఆదుకోవాలనే కృత నిశ్చయంతో కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి వరి ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడం జరిగిందని గుర్తు చేశారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా జిల్లాలో అధికార యంత్రాంగం 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, చక్కటి సమన్వయం, సమిష్టి కృషితోనే ఇది సాధ్యమయ్యిందని అభినందించారు. రైతులు కూడా సంప్రదాయ వరి సాగుకు బదులు అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా కృషి జరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికి చేరినప్పుడే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఈ దిశగా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ నగరంలో అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు విషయంలోనూ అర్బన్ సెగ్మెంట్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ హక్కులు, బాధ్యతలను గుర్తెరిగి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ప్రత్యేకించి మహిళా సర్పంచ్ లు, కార్పొరేటర్ లు, కౌన్సిలర్లు సమర్థవంతంగా పని చేస్తూ, తమకు లభించిన అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబ సభ్యుల జోక్యానికి తావులేకుండా చూసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని భరోసా కల్పించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే పనులను చేపట్టి, సకాలంలో అవి పూర్తయ్యేలా చొరవ చూపాలని, నిధులను పూర్తి స్థాయిలో సక్రమంగా వినియోగం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్లు, రేషన్ కార్డులు, బీమా పథకాల ద్వారా అర్హులైన వారు లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డిప్యూటీ మేయర్ సల్మా తహ సీన్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడి.. దక్షిణ లెబనాన్‌లో ఆరుగురు మృతి



బీరూట్ : ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్‌పై దాడుల్ని కొనసాగిస్తూనే ఉంది. శుక్రవారం తెల్లవారుజామున దక్షిణ లెబనాన్‌పై వైమానిక దాడి జరిపి ఆరుగురిని హతమార్చినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇజ్రాయిల్ సరిహద్దుకు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న దక్షిణ లెబనాన్‌లో అనుమానాస్పదమైన కదలికలు ఉన్నట్లు గుర్తించి వైమానిక దాడి జరిపినట్లు ఇజ్రాయిల్ సైన్యం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ దాడిలో ఇద్దరు మృతి చెందారు. మృతుల చేతుల్లో ఆయుధాలు ఉన్నాయని ఇజ్రాయిల్ సైన్యం పోస్టులో పేర్కొంది. కాగా, దక్షిణ లెబనాన్‌లోని వైద్య శిబిరంపైనా ఇజ్రాయిల్ దాడులకు తెగబడింది. టైర్ జిల్లాలోని హనౌయియా పట్టణంలో ఉన్న ఇస్లామిక్ హెల్త్ అథారిటీ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని శుక్రవారం తెల్లవారుజామున జరిపిన వైమానిక దాడిలో నలుగురు మరణించినట్లు లెబనాన్ జాతీయ వార్తా సంస్థ (ఎన్ఎన్ఎ) ధృవీకరించింది. ఈ దాడిలో ఇద్దరు పారామెడిక్స్‌కి గాయాలయ్యాయని ఎన్ఎన్ఎ నివేదించింది.

# రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్‌లు అయితే వారి పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా అని ప్రశ్నించింది. సామాజికంగా, ఆర్థికంగా ముందుకు వచ్చిన కుటుంబాలు పదే పదే కోటా ప్రయోజనాలు పొందడం అవసరమా అన్న సుప్రీంకోర్టు.. రిజర్వేషన్ల ద్వారా సామాజిక స్థితిలో మార్పు సాధించిన కుటుంబాలు రిజర్వేషన్ వ్యవస్థ నుండి బయటకు రావాలి'అని స్పష్టం చేసింది. రిజర్వేషన్లలో కొనసాగితే ఈడబ్ల్యూఎస్‌కు, క్రిమిలేయర్‌కు తేడా ఏముంటుంది?. ఆ రెండింటి మధ్య తేడా ఉండాల్సిందేనని తెలిపింది. ఓబీసీ క్రిమిలేయర్, రిజర్వేషన్లపై నమోదైన దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు జస్టిస్ బీవీ నాగరత్న,జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం రిజర్వేషన్లపై వ్యాఖ్యానించింది. ఓబీసీ క్రిమిలేయర్‌కు సంబంధించిన రిజర్వేషన్ ప్రయోజనాలపై పిటిషన్‌ను విచారిస్తున్న జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జ్వల్ భుయన్లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.'ఇద్దరూ ఐఏఎస్ అధికారులు.ప్రభుత్వ సేవలో ఉన్నారు. బాగా స్థిరపడ్డారు. ఇప్పుడు వారి పిల్లలకు రిజర్వేషన్ అవసరమా?'అని ప్రశ్నించింది. జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ..'విద్యా, ఆర్థిక శక్తివంతతతో సామాజిక స్థితి మార్పు వస్తుంది. కానీ మళ్లీ పిల్లలకు రిజర్వేషన్ కోరితే, ఈ వ్యవస్థ నుండి ఎప్పటికీ బయటకు రాలేము'అని అన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో సామాజిక వెనుకబాటు ఉండదని, కేవలం ఆర్థిక వెనుకబాటు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ కేసులో వాదించిన అడ్వకేట్ శశాంక్ రత్నూ మాట్లాడుతూ..'క్రీమీ లేయర్‌లో వ్యక్తులను వారి జీతం ఆధారంగా కాకుండా, వారి స్థాయి ఆధారంగా తప్పించారు. కాబట్టి దీన్ని లోతుగా పరిశీలించాలి'అని వాదించారు. ఆయన,ఈడబ్ల్యూఎస్, క్రీమీ లేయర్‌ను ఒకే విధంగా చూడకూడదని, క్రీమీ లేయర్ ప్రమాణాలు మరింత సడలింపుగా ఉండాలని సూచించారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, సుప్రీం కోర్టు పిటిషనర్లు, ప్రతివాదులు వంటి సంబంధిత పక్షాల నుంచి సమాధానాలు కోరుతూ నోటీసులు జారీ చేసింది.

# మహిళలపై పులి పంజా.. నలుగురు మృతి



ముంబై: మహారాష్ట్రలో బెబ్బులి బీభత్సం సృష్టించింది. బీడీ ఆకులు ఏరుకునడానికి అడవికి వెళ్లిన మహిళలపై తన పంజా విసిరింది. మట్టుత్తం 13 మంది మహిళలపై బెబ్బులి దాడి చేయగా అందులో నలుగురు మహిళలు మృతి చెందారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చంద్రపూర్ జిల్లా గంజేవాహి అడవీ ప్రాంతంలో ఈ రోజు ఉదయం 8 గంటల సమయంలో మహిళలు బీడీ ఆకులు ఏరుకోవడానికి అడవికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే మాటు వేసిన పులి విచక్షణ రహితంగా వారిపై దాడి చేసింది. వారికి పారిపోయే అవకాశం ఇవ్వకుండా విరుచుకపడింది. మట్టుత్తంగా 13 మందిపై బెబ్బులి దాడి చేయగా అందులో నలుగురు మృతిచెందారు. మృతిచెందిన వారు దాదాజి మెహర్లే, సంగీతా సంతోష్ చౌదరీ, కౌశిక్ మట్నహర్లే, అనుబాయి దాదాజీ మట్నహర్లేగా గుర్తించారు. దీంతో వివరాలు తెలుసుకున్న అడవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా ఇటీవల కాలంలో మహారాష్ట్రలోని అటవీ ప్రాంతాల్లో మనుషులు-వన్యప్రాణుల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చంద్రపూర్ జిల్లాలో పులుల సంఖ్య అధికంగా ఉండటంతో తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గడం, మానవ నివాసాలు అటవీ ప్రాంతాలకు దగ్గర కావడం వంటి కారణాలతో పులులు గ్రామాల వైపు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పులుల భయం తగ్గేలా అటవీశాఖ అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# ఫ్యూచర్ సిటీని రద్దు చేసి తీరతాం



హైదరాబాద్: సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు సంచలన ప్రకటన చేశారు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని ప్రకటించారాయన. అలాగే.. ఫార్మాసిటీని మళ్లీ తీసుకొస్తామని తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఫార్మా సిటీకే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని పార్లమెంట్ చట్టం ఉంది. రేవంత్ ప్రభుత్వం కేవలం డ్రామా చేస్తోంది. హై కోర్టు లో ఈ మధ్య ఒక కేసు వచ్చింది. మేము ఫార్మా సిటీ కంటిన్యూ చేస్తున్నామని రేవంత్ ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. అసలు విషయం ఇదే. రేవంత్ సర్కార్ కేవలం జిమ్మిక్కు చేస్తోంది ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధం గా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారు. 75 శాతం ఫార్మా సిటీ ఉండి.. మిగతా 25 పర్సెంట్ మిగతావి ఉండాలని చేస్తున్నారు. కానీ 75 శాతం మిగతా వ్యాపారం కేవలం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారు. ఇది చట్ట ప్రకారం చెల్లదు. కానీ కాంగ్రెస్ ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది మేము ప్రభుత్వం లోకి వచ్చాక ఫ్యూచర్ సిటీ రద్దు వంద శాతం చేస్తాం. ఫార్మా సిటీ నీ రీస్టోర్ చేస్తాం. ఇది నా మాట కాదు. పార్లమెంట్ చట్టం ఇది. ఫార్మా సిటీ వస్తె లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నర ఏళు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుంది అని ఇలా చేశారు. వాళ్ళు ఏమి చేసినా నడవదు... నిలబడదు.. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది అని హరీష్‌రావు అన్నారు. "ఫ్యూచర్ సిటీ", "ఫార్మాసిటీ" రెండూ తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన భారీ ప్రాజెక్టులే. కానీ ప్రభుత్వాలు మారడంతో వాటి దిశ కూడా మారిపోయింది. తెలంగాణలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో "ఫార్మాసిటీ" పేరుతో ప్రపంచంలోనే అతిపెద్ద ఔషధ పరిశ్రమల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ రావాల్సి ఉంది. దేశ విదేశాల నుంచి పెద్ద పెద్ద ఔషధ కంపెనీలు వచ్చి పెట్టుబడులు పెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. దీనివల్ల ఉద్యోగాలు పెరుగుతాయని.. తెలంగాణ ఔషధ రంగంలో అగ్రస్థానానికి చేరుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. భూములు కోల్పోతామన్న భయం ఒకవైపు.. కాలుష్యం పెరిగి నీరు, గాలి దెబ్బతింటాయన్న ఆందోళన మరోవైపు పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. ముఖ్యంగా యాచారం, కందుకూరు ప్రాంతాల్లో రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం "ఫార్మాసిటీ" ఆలోచనను పక్కనబెట్టింది. అయితే.. అదే ప్రాంతంలో "ఫ్యూచర్ సిటీ" అనే కొత్త ఆలోచనను తెరపైకి తీసుకొచ్చింది. ఇది కేవలం పరిశ్రమల నగరం కాదు.. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు సాంకేతికత, కృత్రిమ మేధస్సు, పరిశోధనలు, హరిత వాతావరణం, నివాసాలు, ఉద్యోగ కేంద్రాలు అన్నీ కలిసిన ఆధునిక నగరంగా అభివర్ణిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం.

# ప్రధాని మోడీ పొదుపు విజ్ఞప్తి వెనుక అసలు కారణం ఏమిటి?

"ఏ కార్యక్రమం అయినా బంగారం కొనకండి. ఏడాది పాటు విదేశీ పర్యాటక యాత్రలు వాయిదా వేసుకోండి. పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించండి.. వీలైతే వర్క్ ఫ్రమ్ హోమ్ చేయండి.. ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లండి. వంటనూనెలు సైతం తక్కువగా వాడండి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన విజ్ఞప్తితో దేశ ప్రజలు ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ప్రజలకు ఈ తరహా హెచ్చరిక కొత్త కావడంతో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందేమోనని ఆందోళన పడుతున్నారు.. కరోనా సమయంలో మోడీ టీవీ ముందుకు వచ్చారంటేనే చాలు హడలిపోయేవారు.. ఇప్పుడు కూడా కాస్తో కూస్తో అలాంటి ఫీలింగే కలిగింది. అసలు ప్రధాని ఈ తరహా వ్యాఖ్యలు చేయడానికి కారణం ఏంటి ఈ పొదుపు మంత్రం వెనుక ఉన్న మర్మం ఏంటి ఎన్నికలు అయ్యాకే ప్రకటించడం వెనుక అర్థం ఏమిటి ఈ అంశాలపై క్షుణ్ణంగా చర్చిద్దాం..




## డిమాండ్ తగ్గితేనే.. డాలర్ నియంత్రణ

గడిచిన కొద్ది కాలంగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నుంచి మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వరకు అన్నీ కూడా ప్రపంచ సరఫరా గొలుసును అస్తవ్యస్తం చేశాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, వంటనూనెల వాడకం తగ్గించాలని.. విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రభుత్వం కోరుతోందంటే.. దాని వెనుక ఉన్న ప్రధాన శత్రువు 'కరెన్సీ విలువ పతనం' తో పాటు 'విదేశీ మారక ద్రవ్య నిల్వల' రక్షణ అంశాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. సామాన్యుడికి అర్థమయ్యేలా చెప్పాలంటే, ఒక దేశం విదేశాల నుంచి ఏదైనా వస్తువును కొనాలన్నా లేదా విదేశాలకు వెళ్లి ఖర్చు చేయాలన్నా అది డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. మనం ఎంత ఎక్కువ పెట్రోల్ వాడితే, ఎన్ని ఎక్కువ లీటర్ల వంటనూనెను దిగుమతి చేసుకుంటే, ఎంత ఎక్కువగా విదేశాల్లో డాలర్లు ఖర్చు చేస్తే.. మన దేశం దగ్గర ఉన్న డాలర్ల నిల్వలు అంతగా తగ్గిపోతాయి. డాలర్లు తగ్గే కొద్దీ అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ బలహీనపడుతుంది. రూపాయి బలహీనపడితే వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ ద్రవ్యోల్బణ చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికే, ప్రజల భాగస్వామ్యంతో 'డిమాండ్' ను తగ్గించి, తద్వారా దేశం నుంచి బయటకు వెళ్లే డాలర్ల ప్రవాహాన్ని నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే, మోడీ వ్యాఖ్యలు దేశ ఆర్థిక వ్యవస్థ పతనాన్ని సూచిస్తాయని.. దీనివల్ల విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి వెళ్తారని ఇది దేశానికి తీవ్ర నష్టమన్న వాదనలు కూడా వస్తున్నాయి.

## బంగారం.. దేశానికి భారమే!

బంగారం కొనుగోళ్లపై ప్రధాని చేసిన విజ్ఞప్తి వెనుక ఒక బలమైన ఆర్థిక వ్యూహం ఉంది. భారతీయులకు బంగారం అనేది కేవలం ఆభరణం కాదు, అదొక సెంటిమెంట్, భద్రత. కానీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా చూస్తే బంగారం ఒక 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్'. మనం కొనే ప్రతి గ్రాము బంగారం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. దీనివల్ల మన విదేశీ మారక ద్రవ్యం భారీగా తరలిపోతుంది. ఆ బంగారం బీరువాల్లో లాక్ అయి ఉంటుంది తప్ప, అది దేశ ఉత్పత్తి రంగంలోకి గానీ, మౌలిక సదుపాయాల కల్పనలోకి గానీ రాదు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అనిశ్చితి సమయంలో, ప్రజలు తమ నగదును నిరుపయోగంగా ఉండే బంగారంపై కాకుండా, దేశీయ పొదుపు పథకాల్లో లేదా మార్కెట్లో పెట్టుబడిగా పెడితే అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది.

## ఇది భయపెట్టడమే.. రఘురామ్ రాజన్

'బంగారం కొనుగోళ్లు.. విదేశీ ప్రయాణాలను నియంత్రించడం వంటి అంశాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చాలా నిశ్శబ్దంగా, మార్కెట్ శైలిలో నిర్వహించాలి. ప్రధాని స్థాయి వ్యక్తి నేరుగా ప్రజలకు పిలుపునివ్వడం వల్ల మార్కెట్లలో అనవసరమైన ఆందోళన మొదలవుతుంది. ఇది విదేశీ ఇన్వెస్టర్లకు తప్పుడు సంకేతాలు పంపే ప్రమాదం ఉంది' అని మాజీ ఆర్బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఆయన వాదన ప్రకారం.. ప్రభుత్వం ఇలా నేరుగా ప్రజలను కోరడం అంటే 'దేశం దగ్గర డాలర్లు అయిపోతున్నాయి' అనే భ్రమను కలిగించే అవకాశం ఉన్నది. ఇది 2013 నాటి రూపాయి సంక్షోభాన్ని గుర్తుకు తెస్తున్నదని అభిప్రాయపడ్డారు.

## ముందు జాగ్రత్తలు అవసరమే.. వీకే విజయకుమార్

ముందస్తు జాగ్రత్తలు ఏ దేశానికైనా మంచిదేనని మోడీ కామెంట్ల నేపథ్యంలో జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ స్పందించారు. 'ప్రస్తుతం పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో కరెంట్ అకౌంట్ లోటును (సీఏడీ) మేనేజ్ చేయడానికి ప్రధానమంత్రి చేసిన ఈ పిలుపు ఒక క్రైసిస్ మేనేజ్‌మెంట్ చర్యగా కనిపిస్తున్నది. ఇది స్వల్పకాలంలో వృద్ధిపై స్వల్ప ప్రభావం చూపినప్పటికీ.. రూపాయి విలువ మరింతగా పడిపోకుండా కాపాడటానికి ఇది అత్యవసరం' అని పేర్కొన్నారు. ఈ విశ్లేషణ ప్రకారం, చమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్లకు చేరువవుతున్న తరుణంలో, పెట్రోల్.. బంగారం వాడకాన్ని తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దేశానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో అత్యవసర విషయం కానున్నది.

## ఎన్నికలు ముగిసాకే చెప్పాలా?

ఇరాన్ యుద్ధం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని ప్రభుత్వానికి ముందుగానే అంచనా ఉన్నదని.. అయినా, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేయలేదన్న వాదనలు వస్తున్నాయి. వాటికి ఆధారంగా.. ఎన్నికలు ముగిసిన తర్వాత బెంగాల్ బయట జరిగిన తొలి సభలోనే మోడీ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వండని ప్రజలను వేడుకోవడం హెచ్చరికలు చేయడం ఫక్తు రాజకీయ లబ్ధి కోసమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ప్రజలు అడగకున్నా ఇస్తున్న ఉచిత పథకాలు రద్దు చేస్తే.. ఇటువంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమే ఉండదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# 1138 పాఠశాలల్లో గ్రంథాలయాలు.. జ్ఞాన తెలంగాణకు బలమైన పునాది!

"చదువే మనిషిని ఉన్నతుడిని చేస్తుంది" అనే మాట యుగయుగాల సత్యం. పుస్తకాలు కేవలం అక్షరాల సమాహారం మాత్రమే కాదు. అవి మనిషి ఆలోచనలను, విలువలను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనాలు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1138 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం విద్యా చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోనుంది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి, జ్ఞానాన్ని విస్తరించడానికి, ఆలోచనా శక్తిని అభివృద్ధి చేయడానికి ఈ నిర్ణయం విద్యా రంగంలో కొత్త దిశను ప్రారంభించింది. దేశ చరిత్రలో ఇంత పెద్ద స్థాయిలో పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు అరుదైన విషయం. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు వెయ్యి పౌర గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన తర్వాత, ఇప్పుడు ప్రభుత్వం దూరదృష్టితో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయంగా చెప్పవచ్చు.

## పుస్తకం.. చేతిలో పెట్టుకునే కలల ప్రపంచం!

గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాల గది కాదు. అది జ్ఞాన సముద్రం. ఒక మంచి గ్రంథాలయం విద్యార్థిలో చదవాలనే ఆసక్తిని పెంచుతుంది. పుస్తక పఠనం ద్వారా పిల్లల్లో ఏకాగ్రత, విశ్లేషణా శక్తి, సృజనాత్మకత పెరుగుతాయి. కథలు, జీవిత చరిత్రలు, విజ్ఞాన సర్వస్వాలు, శాస్త్ర గ్రంథాలు చదవడం ద్వారా విద్యార్థులు విభిన్న ప్రపంచాలను తెలుసుకుంటారు. పుస్తకాలు చదివే అలవాటు ఉన్న పిల్లలు భవిష్యత్తులో మంచి రచయితలు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, పరిపాలకులుగా ఎదగగలరు. పఠనం పిల్లల భాషా నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేస్తుంది. పదజాలం పెరగడమే కాకుండా, తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తీకరించే శక్తి కూడా వస్తుంది. వివిధ రచయితల ఆలోచనలతో పరిచయం వల్ల పిల్లల్లో విమర్శనాత్మక దృష్టి పెరుగుతుంది. "పుస్తకం అనేది చేతిలో పెట్టుకునే కలల ప్రపంచం" నెహ్రూ చెప్పిన మాట ఈ సందర్భోచితం.

## గ్రంథాలయం లేని పాఠశాల.. నీరు లేని బావి

ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో గ్రంథాలయాల ఏర్పాటు విద్యార్థులను ఉన్నత విద్యకు సిద్ధం చేసే పునాది వంటిది. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువులు కొనసాగించాలంటే పఠనాభ్యాసం అత్యంత అవసరం. వివిధ దృక్కోణాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటాడు. అందుకే "గ్రంథాలయం లేని పాఠశాల నీరు లేని బావి వంటిది" అని అంటారు. ఈ గ్రంథాలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం (15000 ఽ 10000) అందిస్తోంది. ప్రతి పాఠశాలకు పుస్తకాల కొనుగోలు, నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయడం మంచి పరిణామం. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఆకర్షణీయమైన, ఉపయోగకరమైన గ్రంథాలయాలను ఏర్పాటు చేయవచ్చు.




## లైబ్రరీలు వాళ్లకు మరీ అవసరం!

ప్రస్తుతం అనేక కంపెనీలు తమ సీఎస్ఆర్ (జూ=) నిధుల ద్వారా విద్యా రంగానికి సహకరిస్తున్నాయి. పాఠశాలలకు పుస్తకాలు, ఫర్నిచర్, కంప్యూటర్లు, డిజిటల్ వనరులు అందిస్తున్నాయి. ప్రభుత్వం ఒక్కటే కాదు, సమాజమంతా కలిసి పనిచేసినప్పుడే ఈ కార్యక్రమం విజయవంతమవుతుంది. ప్రత్యేకంగా గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు గ్రంథాలయాలు అత్యంత అవసరం. నగరాల్లో ఉన్న విద్యార్థులకు లభించే అవకాశాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండవు. అక్కడి పిల్లలకు మంచి పుస్తకాలు, సమాచార వనరులు అందుబాటులోకి రావడం చాలా అరుదు. అలాంటి ప్రాంతాల్లో ఒక చిన్న గ్రంథాలయం కూడా విద్యార్థులకు ప్రపంచాన్ని చూపించే కిటికీగా మారుతుంది.

## తెలుగు పుస్తకాల పంపిణీ ఆవశ్యం!

పుస్తకాల ఎంపిక విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరం. చిన్నారులకు అర్థమయ్యే భాషలో, ముఖ్యంగా తెలుగు మాతృభాషలో పుస్తకాలు ఎక్కువగా ఉండాలి. తెలుగు కథలు, పద్యాలు, విజ్ఞాన పుస్తకాలు, జీవిత చరిత్రలు పిల్లలపై గొప్ప ప్రభావం చూపుతాయి. ఇంగ్లీషు పుస్తకాలు కూడా అవసరమే అయినప్పటికీ, మొదట పిల్లలు తమ భాషలో చదవడం అలవాటు చేసుకోవాలి. ధైర్యం, నిజాయితీ, స్నేహం, సామాజిక బాధ్యత వంటి విలువలను బోధించే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉండాలి.

## మంచి పుస్తకం... మనసుకు ప్రశాంతత

ఇప్పటి డిజిటల్ యుగంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, టీవీలు, సోషల్ మీడియాతో గడుపుతున్నారు. దీనివల్ల పఠన అలవాటు తగ్గిపోతోంది. గ్రంథాలయాలు ఈ పరిస్థితిని మార్చగలవు. భౌతిక పుస్తకం చేతిలో పట్టుకుని చదవడం ద్వారా ఏకాగ్రత, సహనం, లోతైన ఆలోచన పెరుగుతాయి. కథలు చదివే పిల్లల్లో ఊహాశక్తి, భావోద్వేగ పరిపక్వత కూడా అభివృద్ధి చెందుతుంది. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా పుస్తక పఠనం ఎంతో సహాయపడుతుంది. ఐనిస్టీన్ చెప్పినట్లు, మంచి పుస్తకం మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. ఈ రోజుల్లో విద్యార్థులు పరీక్షల ఒత్తిడితో బాధపడుతున్న సమయంలో గ్రంథాలయాలు వారికి మానసిక విశ్రాంతి కలిగించే ప్రదేశాలుగా మారవచ్చు.

## భవిష్యత్తు తరాలకు గొప్ప బహుమతి..

మొత్తానికి తెలంగాణ ప్రభుత్వం 1138 పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప బహుమతి. ఇది కేవలం పుస్తకాల గదుల నిర్మాణం కాదు. ఈ గ్రంథాలయాల ద్వారా రేపటి శాస్త్రవేత్తలు, రచయితలు, సామాజిక నాయకులు తయారవుతారు. ఒక గ్రామీణ విద్యార్థి చేతిలో సరైన పుస్తకం చేరితే, అది అతని జీవితాన్నే మార్చగలదు. తెలంగాణ ఈ కార్యక్రమం ద్వారా దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. చదవడం అలవాటుగా, పుస్తకం జీవిత భాగస్వామిగా మారితేనే నిజమైన జ్ఞాన సమాజం నిర్మితమవుతుంది.

# కార్మికుడి శ్రమకు గణాంకాల మేకప్..

ఈరోజుల్లో ఆధునిక దోపిడీ స్వరూపాలు మారాయి. దేశాలను సైన్యాలతో ఆక్రమించే కాలం పోయి, మనుషుల శ్రమను, వారి గౌరవ ప్రదమైన జీవనాన్ని నేరుగా లూటీ చేసే కాలం వచ్చింది. ఈ దోపిడీని మెరుగు పరచడానికి కార్పొరేట్ శక్తులు ఉపయో గించే తాజా ఆయుధం రంగురంగుల గణాంకాల ఛార్టుల నివేదికలు. వాటిలో ఒకటి 'వర్క్ ఇండియా' వేతన నివేదిక. దీన్ని పైపైన మాత్రమే చూస్తే భారతదేశంలోని బ్లూ కాలర్ కార్మికులు గాలిలో తేలియాడుతున్నట్టు, వారి జీవితాలు స్వర్ణయుగంలోకి అడుగుపెట్టినట్టు అనిపిస్తుంది. కానీ వాస్తవం చూస్తే ఇది దశాబ్దాలుగా కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న హక్కులపై జరుగుతున్న క్రూరమైన దాడిగానే అర్థమవుతుంది.

## ఆదాయం పెరిగినట్టా?

ఈ నివేదిక ప్రకారం, 2024లో సగటు వేతనం నెలకు 14,056 రూపాయలు ఉంటే, 2025లో ఎనిమిది శాతం పెరిగి 15,265 రూపాయలకు చేరిందని. ఇది వైట్ కాలర్ ఉద్యోగుల కంటే ఎక్కువ వృద్ధి సాధించినట్లు ప్రచారం చేస్తున్నారు. డెలివరీ, డ్రైవింగ్, తయారీ రంగాల్లో కొంత ఎక్కువ ఆదాయం పెరిగినట్టు చూపిస్తున్నారు. ఈ సంఖ్యలు పేపర్ మీద మాత్రమే అద్భుతంగా కనిపిస్తాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా, అద్దెలు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులు 10-20% పెరిగాయి. అధికారిక ద్రవ్యోల్బణం సగటున 3-5% మధ్య ఉన్నప్పటికీ, కార్మికుల రోజువారీ జీవన వ్యయం దానికంటే చాలా ఎక్కువగా ఉంది. ఇలాంటప్పుడు రెండు వేల రూపాయల పెరుగుదలతో కుటుంబం పోషణ ఎలా సాధ్యం? ఇది కడుపు నింపడం కాదు, అప్పుల ఊబిలో ముంచేయడం. జాతీయ కార్మిక వేతన కమిషన్లు, కేంద్ర ప్రభుత్వం సెమీ-స్కిల్డ్ కార్మికులకు రోజుకు 868 రూపాయలు (నెలకు సుమారు 22,500 రూపాయలు) కనీస వేతనంగా నిర్ణయించాయి. కానీ నివే దికలో చూపించిన 15,265 రూపాయలు దానికి బాగా తక్కువ. అనేక చోట్ల ఇది కూడా అమలు కావడం లేదు.

## కార్మికుల ఐక్యతను చీల్చే కుట్ర..

ఇక్కడ గౌరవప్రదమైన జీవనం అంటే ఏమిటి? మానవుడు తన కుటుంబంతో ఆనందంగా, గౌరవంగా జీవించగలగడం. కానీ ప్రస్తుత వేతనాలు ఆ హక్కును కాలరాస్తున్నాయి. వైట్ కాలర్ ఉద్యోగులకు భత్యాలు, ఉద్యోగ భద్రత ఉంటాయి. వారు ఏసీ గదుల్లో పని చేస్తారు. కానీ బ్లూ కాలర్ కార్మికులు ఎండలో కాలి, వర్షంలో తడిచి, అగ్ని గుండాల్లో కరిగి, రసాయనాల మధ్య ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తారు. వారికి దక్కేది కేవలం కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను కలిపి పోల్చి 'బ్లూ కాలర్ వారి వేతనాలు ఎక్కువగా పెరుగుతున్నాయి' అని చెప్పడం పచ్చి అబద్ధం. ఇది కార్మికుల మధ్య విభేదాలు సృష్టించి, వారి మధ్య ఉన్న ఐక్యతను చీల్చి, అసలు దోపిడీదారుడిని రక్షించే కుట్ర. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక పాత వ్యూహం ఉంది.. బాధితులను ఒకరిపై ఒకరిని పోట్లాడేలా చేయడం. ఇప్పుడు అదే జరుగుతోంది. కార్మికులను ఒకరి నౌకరు సందేహించేలా చేసి, యాజమాన్యాల లాభాలను కాపాడుతున్నారు. ఇంకొక భయంకరమైన విషయం ఏమిటంటే పాత కార్మిక చట్టాల సవరణ. శతాబ్దాల కష్టాలతో, అనేక పోరాటాలతో సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి, 'వ్యాపారాలకు సౌకర్యం' పేరుతో యాజమాన్యాలకు అనుకూలంగా మలిచారు. ఒప్పంద కార్మికులను సులభంగా నియమించడం, తొలగించడం, సమ్మె హక్కుపై పరిమితులు.. ఇవన్నీ శ్రమ దోపిడీని చట్టబద్ధం చేస్తాయి. లాభాలు కార్పొరేట్ ఖాతాల్లోకి, నష్టాలు కార్మికుల నెత్తిన. ఇక అంతర్జాతీయ సంక్షోభాలను సైతం వేతనాలు అదుపులో ఉంచడానికి సాకుగా వాడుకుంటున్నారు.



## వేతనాలు ఇలా నిర్ణయించాలి!

నిజమైన అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు. ప్రతి కార్మికుడి జీవితం గౌరవప్రదంగా ఉండాలి. దేశంలో అనధికారిక రంగం ఇప్పటికీ 80-90% ఉంది. అక్కడ భద్రత, సామాజిక రక్షణ లేవు. మహిళా కార్మికుల వేతనాలు మరింత తక్కువగా ఉండటం మరో విషాదం. అందుకే నివేదికల అంకెల మాయను గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ భేదాలు మరచి అందరూ ఐక్యంగా నిలబడాలి. కార్మిక సంఘాలు బలపడాలి. కనీస వేతనాలు నిజమైన జీవన వ్యయానికి అనుగుణంగా నిర్ణయించాలి. కార్మిక చట్టాలను కార్మికులకు అనుకూలంగా సవరించాలి. ప్రభుత్వాలు కార్పొరేట్ లాబీలకు కాకుండా శ్రామికుల హక్కులను కాపాడాలి. ఇది కేవలం జీతభత్యాల సమస్య మాత్రమే కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ దోపిడీకి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ విషయాన్ని గుర్తించి, ఐక్యంగా పోరాడితేనే గెలుపు సాధ్యం.

# సూర్యఘర్ పథకానికి తొగుట గ్రామం ఎంపిక..
# 800 ఇండ్లకు సోలార్ ఏర్పాటు



దుబ్బాక (లోకల్ గైడ్) మే 22:దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట మండల కేంద్ర గ్రామమైన తొగుటను ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా గ్రామంలోని సుమారు 800 ఇండ్లపై సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి అమర్, గ్రామ సర్పంచ్ పాగాల శోభా కొండల్ రెడ్డి గార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గార్లకు మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామానికి ఈ పథకం రావడం వల్ల ప్రజలకు ఉచిత విద్యుత్ వినియోగంలో ఉపశమనం కలగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచులు రాంపురం రమేష్, లాచోళ్ల రవీందర్, ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఉపేందర్, ఉపసర్పంచులు గౌస్, తిరుపతి, డైరెక్టర్లు బాలమల్లు, అన్సర్, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనకర్ రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, భారత్ తేజ, పోచయ్య, రవీందర్, బాల్ రెడ్డి, నరసింహులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో విద్యార్థుల రవాణా సంస్కరణలకు శ్రీకారం

-500కు పైగా విద్యాసంస్థలకు విద్యార్థుల ప్రయాణ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం




హైదరాబాద్, మే 22 ,(లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్తంగా విద్యార్థుల రవాణా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సరసమైన రవాణా సౌకర్యాల కల్పన లక్ష్యంగా భారీ స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. హైదరాబాద్ లోని ఐఈఐ ఈఎస్‌సీఐ శతాబ్ది సమావేశ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పరిధిలోని 500కు పైగా విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే సుమారు 2 లక్షల వాహనాలు విద్యాసంస్థల వద్ద గుమికూడుతున్నాయని పేర్కొన్నారు. ఈ రద్దీ కారణంగా ప్రమాదాలు, పిల్లల భద్రత సమస్యలు, కుటుంబాలలో ఇబ్బందులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం తాత్కాలిక ట్రాఫిక్ పరిష్కారం కాదని, దీర్ఘకాలిక పౌర రవాణా సంస్కరణగా అమలు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. విద్యార్థుల భద్రతతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, పంచుకునే రవాణా విధానం, పారదర్శక రవాణా వ్యవస్థ లక్ష్యమని చెప్పారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌సీఎస్‌సీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి నవేద్ ఖాన్ వెల్లడించిన వివరాల ప్రకారం, సైబరాబాద్ పరిధిలోని 526 విద్యాసంస్థలపై నిర్వహించిన సర్వేలో సుమారు 4.1 లక్షల మంది విద్యార్థులను పరిశీలించారు. 80 శాతం విద్యాసంస్థలు రవాణా సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 30 శాతం మంది విద్యార్థులే వాటిని వినియోగిస్తున్నారని తెలిపారు. మిగతా విద్యార్థులు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటం వల్ల ప్రతి రోజు సుమారు 2 లక్షల వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉప ప్రాంతీయ మేనేజర్ శ్రీమతి అపర్ణ కళ్యాణి మాట్లాడుతూ..విద్యార్థుల రవాణాలో ప్రభుత్వ రవాణా సంస్థలు భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలలో విద్యార్థులు కూడా బాధితులవుతున్నారని, పాఠశాల స్థాయి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రితిరాజ్, డీసీపీ కూకట్‌పల్లి; సృజన కె, డీసీపీ మహిళా భద్రత విభాగం;శేషాద్రిని రెడ్డి, డీసీపీ ట్రాఫిక్; నారాయణ అమిత్, జోనల్ కమిషనర్ శేరిలింగంపల్లి; మయాంక్ సింగ్, జోనల్ కమిషనర్ కూకట్‌పల్లి; రామేశ్వరరావు, డైరెక్టర్ ఈఎస్‌సీఐ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖ పంపిన ఆకునూరి మురళి




హైదరాబాద్, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు తన రాజీనామా లేఖను పంపించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆకునూరి మురళి స్పందిస్తూ.. తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్‌గా సేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తన పూర్తి సహకారం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. తన పదవీకాలంలో విద్యా వ్యవస్థలో పలు మార్పులు, సంస్కరణలపై చర్చలు జరిపామని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనేక సూచనలు ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కమిషన్ కృషి చేసిందని పేర్కొన్నారు. ఆకునూరి మురళి రాజీనామా తో తెలంగాణ విద్యా వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం త్వరలోనే కొత్త చైర్మన్ నియామకంపై నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు రాజకీయ, విద్యా వర్గాలలో చర్చ జరుగుతోంది.

# కార్మికులకు రూ.20 వేల కనీస వేతనం..
# దౌల్తాబాద్, రాయపోల్‌లో కాంగ్రెస్ సంబరాలు




దౌల్తాబాద్ (లోకల్ గైడ్) మే 22:దౌల్తాబాద్,రాయపోల్ మండల కేంద్రాల్లో తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ప్రకటించిన కనీస వేతనాల పెంపును పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. "కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని సుమారు 1.11 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించడాన్ని కాంగ్రెస్ నాయకులు స్వాగతించారు. కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం చెరుకు శ్రీనివాస్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాజులపల్లి రాజు గారి ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దౌల్తాబాద్ శేర్‌పల్లి గ్రామంలోని వడ్లు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన ఆయన రైస్ మిల్ యజమానులతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే హైమద్‌నగర్ పత్తి మిల్లును పరిశీలించి అక్కడ వడ్లు నిల్వ చేసే అవకాశాలపై యజమానులతో చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, మిల్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), ప్రధాన కార్యదర్శి జనగామ మల్లారెడ్డి, బండారు లాలు, బొక్కల నాగరాజు, పెరుమాండ్ల నర్సింలు, పంజా స్వామి, కర్ణ శ్రీనివాస్, రైతన్న, ఆది వేణుగోపాల్, లక్ష్మణ్ రమేష్, సంపత్ రెడ్డి, పట్నం యాదగిరి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, పల్లి స్వామి, దుర్గ ప్రసాద్, మహేష్ యాదవ్, సోలిపేట ప్రసాద్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, డాక్టర్ చందు యాదవ్ రెడ్డి, రాయపోల్ స్వామి, మల్లారెడ్డి, వెంకట్రెడ్డి, నర్సారెడ్డి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలు
# భానుడి భగభగలు..వెలవెలబోయిన ఘాట్లు!

తీవ్రమైన ఎండల దెబ్బకు తగ్గిన రద్దీ

ఉదయం కొద్దిసేపే భక్తుల సందడి.. మధ్యాహ్నం నిర్జనంగా మారిన పుష్కర పరిసరాలు



భూపాలపల్లి ప్రతినిధి :(లోకల్ గైడ్ ప్రతినిధి),జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలపై ఎండ ప్రభావం గట్టిగా పడింది. రోహిణి కార్తె ప్రవేశిస్తున్న తరుణంలో ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. భక్తులు భారీగా తరలివస్తారని అధికారులు ఆశించినప్పటికీ, భానుడి భగభగలకు భయపడి జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. దాంతో పుష్కర ఘాట్లు ఆశించిన స్థాయిలో కాకుండా కాస్త వెలవెలబోయి కనిపిస్తున్నాయి. తెల్లవారుజామే కాస్త సందడి.. ఆ తర్వాత అంతా ఖాళీ! ఎండల తీవ్రతను ముందే ఊహించిన భక్తులు కేవలం తెల్లవారుజామున, ఉదయం 8 గంటల లోపే పుష్కర ఘాట్లకు చేరుకుని స్నానాలు ముగించుకుని తిరుగుపయనమవుతున్నారు. ఉదయం 9 గంటలు దాటింది మొదలు.. సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో ఘాట్లు, క్యూలైన్లు, దేవాలయ పరిసరాలు నిర్జనంగా మారుతున్నాయి. సాధారణంగా పుష్కరాల సమయంలో ఉండే కోలాహలం ఎండ దెబ్బకు ఎక్కడా కనిపించడం లేదు. ఇబ్బందుల్లో వృద్ధులు, పిల్లలు..దూరప్రాంతాల నుండి సొంత వాహనాల్లో వచ్చే భక్తులు మధ్యాహ్న సమయాల్లో ప్రయాణాలు చేయలేక, ఇటు ఘాట్ల వద్ద వేడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. భక్తుల రాక తక్కువగా ఉన్నప్పటికీ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తగా పారిశుద్ధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీని వైద్య ఆరోగ్య శాఖ, మిషన్ భగీరథ అన్ని శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇలానేఎండలు ఇలాగే కొనసాగితే శని, ఆదివారాల్లో కూడా భక్తుల రద్దీ సాధారణంగానే ఉండే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు వీకెండ్ కావడంతో భక్తుల రద్దీ పెరగవచ్చని అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు భానుడి ప్రభావం తగ్గితే తప్ప భక్తుల రద్దీ తిరిగి అవకాశం లేదు అని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు. అలాగే పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి చిరు వ్యాపారులు తమ యొక్క వ్యాపారాన్ని కొనసాగించడానికి ఎక్కడెక్కడ నుండి తరలివచ్చారు భక్తుల కోలాహలం లేకపోవడంతో నిరుత్సాహం పడుతున్నారు. ఏదేమైనా ఎండల తీవ్రత తగ్గితేనే భక్తుల కోలాహలం కనిపించేలా ఉంది.

## భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనే మహనీయునికి నిజమైన నివాళి
## చదువుతోనే సమాజంలో గుర్తింపు, ఆత్మగౌరవం సాధ్యం
## మహాదేవపూర్‌లో ఘనంగా దళిత వైతాళికుడి 138వ జయంతి ఉత్సవాలు

ముఖ్య వక్తగా హాజరైన ప్రముఖ మేధావి ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్




భూపాలపల్లి :(లోకల్ గైడ్ ప్రతినిధి)సమాజంలో నెలకొన్న అసమానతలపై, కుల వివక్షపై ఆనాడే తిరుగుబాటు జెండా ఎగరేసిన గొప్ప సామాజిక సంస్కర్త, ఆది హిందూ ఉద్యమ స్థాపకుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ అని ప్రముఖ సామాజిక మేధావి ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో దళిత వైతాళికుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో 'జీవిత చరిత్ర – సామాజిక పోరాటాలు' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సామాజిక గుర్తింపు లభిస్తాయని నమ్మిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని, నేటి తరం యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా, కలిసికట్టుగా ఉంటూ సమసమాజ స్థాపన కోసం కృషి చేసినప్పుడే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనాబాను, ఉప సర్పంచ్ శ్రీజ మరియు వార్డు సభ్యులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తరలివచ్చిన నాయకులు, ప్రజలుఈ సెమినార్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ లింగాల రామయ్య, సంఘ ప్రముఖ నాయకులు ఆయిల సమ్మయ్య, తలారి శ్రీనివాస్, దుర్గం పోచం, చింతల వెంకటేశ్వర్లు, తలారి గట్టయ్య ప్రత్యేకంగా హాజరై ప్రసంగించారు. బీసీ సంఘ నాయకులు సముద్రాల తిరుపతి, కరంగుల బాపురావు పాల్గొని మహనీయుని సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో యువజన నాయకులు గోల్కొండ కిరణ్, లింగాల నిఖిల్, లింగాల సమ్మయ్య, మోటం వెంకటేశ్వర్లు, చింతకుంట్ల రాందాస్, రేవెల్లి రాజశేఖర్, దుర్గం పోచం, మెరుగు దుర్గయ్య, చిట్టి లతో పాటు పలు ప్రజా, దళిత సంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అని లక్ష్మణ్ అన్నారు.

# సంక్లిష్ట ప్లూరల్ వ్యాధికి
# మెడికవర్ వైద్యుల విజయవంతమైన శస్త్రచికిత్స

ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డా. అభిజన్....వెల్లడి




హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే22(లోకల్ గైడ్ న్యూస్):ఊపిరితిత్తులు, ఛాతీ సంబంధిత సంక్లిష్ట వ్యాధులకు అధునాతన చికిత్సలను వరంగల్ లోనే అందిస్తూ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మరో విజయాన్ని నమోదు చేశారు. ఇటీవల ఒక మహిళకు అత్యాధునిక వీడియో అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ (వాట్స్)ను విజయవంతంగా నిర్వహించి ఆరోగ్యవంతురాలిగా తీర్చిదిద్దారు. హైపోథైరాయిడిజం సమస్యతో బాధపడుతున్న మధ్యవయస్కురాలు మూడు నెలలుగా కుడి వైపు ఛాతి నొప్పి, అలసటతో ఆస్పత్రిని సంప్రదించారు. ప్రారంభ పరీక్షల్లో ప్లూరల్ ఎఫ్యూషన్ గుర్తించగా, సీటీ ఛెస్ట్ స్కాన్‌లో కుడి ఊపిరితిత్తి పైభాగంలో ప్లూరల్ థికెనింగ్‌తో పాటు స్వల్ప ద్రవం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రోగి పరిస్థితిని పరిశీలించిన అనంతరం వైద్యులు వీడియో అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ (వాట్స్) నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో ఊపిరితిత్తులలో తీవ్రమైన ప్లూరల్ థికెనింగ్, ఘనమైన అడ్హీషన్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం అడ్హీషియోలైసిస్ చేసి, ప్లూరల్ బయాప్సీ, ద్రవ నమూనాలను పరీక్షల కోసం పంపించారు. హిస్టోపాథాలజీ పరీక్షల్లో ఫారిన్ బాడీ గ్రాన్యులోమా విత్ జెయింట్ సెల్ రియాక్షన్ ఉన్నట్లు తేలింది. వైద్యుల మల్టీడిసిప్లినరీ బృందం సమగ్రంగా పరిశీలించి, రోగికి యాంటీ ట్యూబర్‌క్యులర్ చికిత్సతో పాటు స్టెరాయిడ్స్ ప్రారంభించింది. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడి ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. క్షయవ్యాధి కారణంగా వచ్చే ప్లూరల్ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ట్రాప్డ్ లంగ్, బ్రోంకోప్లూరల్ ఫిస్టులా, ఊపిరితిత్తుల నష్టం వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. అలాగే పెద్ద శస్త్రచికిత్సల అవసరాన్ని కూడా తగ్గించవచ్చన్నారు. ఈ చికిత్సను ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డా. అభిజన్ ఎస్, మినిమల్లీ ఇన్వేసివ్ థొరాసిక్ ఁ కార్డియోవాస్కులర్ సర్జన్ డా. రవి కిరణ్ ఎం విజయవంతంగా నిర్వహించారు. అధునాతన థొరాసిక్ వైద్యంలో మల్టీడిసిప్లినరీ టీమ్ విధానం ఎంతో కీలకమని వారు తెలిపారు.

# ఐటీఐ అడ్మిషన్లపై ముమ్మర ప్రచారం..
# పోస్టర్ ఆవిష్కరించిన మండల కుమార్




దుబ్బాక (లోకల్ గైడ్) మే 22:తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి మరియు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపాధి అవకాశాలను చేరవేయడానికి విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ కోర్సుల వైపు మొగ్గు చూపేలా మొబిలైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ప్రచారంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ దుబ్బాక మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో అడ్మిషన్ల శాతాన్ని పెంచేందుకు అధ్యాపకుల బృందం శుక్రవారం అక్బర్‌పేట్-భూంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, అక్బర్‌పేట్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మండల కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం ఐటీఐ అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సన్నిహిత సంబంధాలు ఉంటాయని తెలిపారు. ఐటీఐ, ఏటీసీ కోర్సుల ద్వారా స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ అడ్మిషన్ల డ్రైవ్‌కు పూర్తి మద్దతు ఇస్తానని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తన వంతు కృషి చేస్తానని మండల కుమార్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు దుబ్బాక ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించి అడ్మిషన్లు పొందాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం తెలంగాణ ఐటీఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వివిధ గ్రామాల యువతీ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాకు 'రెడ్ అలెర్ట్'.. రానున్న మూడు రోజులు నిప్పుల కొలిమే!
## అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు రావద్దు

చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచన



తెలంగాణ గరిష్ట ఉష్ణోగ్రతల సూచనలు
TGDPS
తేది : 22.05.2026

| క్రమసంఖ్య (Sl.No) | జిల్లాలు (Districts) | నమోదైన నిన్నటి గరిష్ట ఉష్ణోగ్రతలు (°C) | రాగల మూడు రోజులకు గరిష్ట ఉష్ణోగ్రతల (°C) ముందస్తు సూచన (Max. Temperature Forecast for next 3 Days) ఈరోజు (Today) | రేపు (Tomorrow) | ఎల్లుండి (Day after tomorrow) |
|---|---|---|---|---|---|
| 1 | పెద్దపల్లి (Peddapalli) | 46.5 | 46.1 | 45.6 | 44.4 |
| 2 | సూర్యాపేట (Suryapet) | 46.5 | 45.0 | 46.0 | 45.4 |
| 3 | రాజన్న సిరిసిల్ల (Rajanna Siricilla) | 46.4 | 45.1 | 42.5 | 42.3 |
| 4 | ఖమ్మం (Khammam) | 46.4 | 45.4 | 46.8 | 45.4 |
| 5 | హనుమకొండ (Hanumakonda) | 46.4 | 44.1 | 44.0 | 43.3 |
| 6 | ములుగు (Mulugu) | 46.4 | 45.6 | 46.5 | 44.8 |
| 7 | నల్గొండ (Nalgonda) | 46.4 | 44.8 | 45.1 | 45.0 |
| 8 | కరీంనగర్ (Karimnagar) | 46.4 | 45.3 | 44.1 | 43.5 |
| 9 | జగిత్యాల (Jagitial) | 46.4 | 46.0 | 44.3 | 43.6 |
| 10 | భద్రాద్రి కొత్తగూడెం (Bhadradri Kothagudem) | 46.4 | 45.6 | 46.7 | 45.9 |
| 11 | మంచిర్యాల (Mancherial) | 46.4 | 46.1 | 45.9 | 44.6 |
| 12 | కుమురం భీమ్ (Kumuram Bheem) | 46.4 | 46.1 | 45.8 | 44.2 |
| 13 | జయశంకర్ (Jayashankar) | 46.4 | 45.9 | 45.6 | 44.6 |
| 14 | నిజామాబాద్ (Nizamabad) | 46.3 | 44.7 | 42.1 | 42.1 |
| 15 | యాదాద్రి భువనగిరి (Yadadri-Bhuvanagiri) | 46.3 | 43.6 | 43.8 | 42.4 |
| 16 | మహబూబాబాద్ (Mahabubabad) | 46.3 | 45.0 | 45.8 | 44.3 |
| 17 | నిర్మల్ (Nirmal) | 46.3 | 45.9 | 43.5 | 43.1 |
| 18 | ఆదిలాబాద్ (Adilabad) | 46.2 | 45.3 | 43.3 | 42.5 |
| 19 | వరంగల్ (Warangal) | 46.2 | 44.5 | 44.5 | 43.4 |
| 20 | సిద్దిపేట (Siddipet) | 46.1 | 45.0 | 42.8 | 42.3 |
| 21 | కామారెడ్డి (Kamareddy) | 45.9 | 43.3 | 41.4 | 41.5 |
| 22 | జనగాం (Jangaon) | 45.5 | 43.4 | 43.9 | 42.9 |
| 23 | మెదక్ (Medak) | 45.1 | 42.9 | 40.5 | 40.7 |
| 24 | నాగర్ కర్నూల్ (Nagarkurnool) | 44.9 | 40.8 | 42.0 | 42.2 |
| 25 | రంగారెడ్డి (Rangareddy) | 44.9 | 42.2 | 41.5 | 41.3 |
| 26 | సంగారెడ్డి (Sangareddy) | 44.1 | 42.7 | 40.5 | 40.7 |
| 27 | మేడ్చల్ - మల్కాజిగిరి (Medchal- Malkajgiri) | 43.9 | 42.9 | 41.1 | 40.4 |
| 28 | మహబూబ్ నగర్ (Mahabub Nagar) | 43.6 | 40.2 | 40.1 | 40.6 |
| 29 | హైదరాబాద్ (Hyderabad) | 43.4 | 42.1 | 40.2 | 39.8 |
| 30 | జోగులాంబ గద్వాల్ (Jogulamba Gadwal) | 43.3 | 40.0 | 39.9 | 40.5 |
| 31 | వికారాబాద్ (Vikarabad) | 43.1 | 41.0 | 40.5 | 40.0 |
| 32 | వనపర్తి (Wanaparthy) | 42.8 | 40.2 | 40.0 | 40.7 |
| 33 | నారాయణపేట (Narayanpet) | 42.4 | 40.2 | 39.6 | 40.4 |

>=45°C హెచ్చరిక | >40- <45°C అప్రమత్తం | >=35-<=40°C జాగ్రత్త | <35°C హెచ్చరిక లేదు

భూపాలపల్లి :(లోకల్ గైడ్ ప్రతినిధి)జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు ఎండ తీవ్రత విపరీతంగా పెరగనుందని, వాతావరణ శాఖ 'రెడ్ అలెర్ట్' జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు ఎండదెబ్బ (వడదెబ్బ) బారిన పడకుండా తమను తాము రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. భానుడి భగభగలు ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే ఇండ్ల నుండి బయటకు రావాలని.. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయాల్లో ప్రయాణాలు పెట్టుకోవద్దని, వీలైనంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ సూచించిన ముఖ్యమైన జాగ్రత్తలు: దాహం వేయకపోయినా సరే.. నిరంతరం తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటి ద్రవపదార్థాలను సమృద్ధిగా తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు లేత రంగు కాటన్ (నూలు) దుస్తులు ధరించడం ఉత్తమం. ఎండలో వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేదా కాటన్ గుడ్డతో కప్పుకోవాలి. గొడుగు తప్పనిసరిగా వాడాలి. చిన్న పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీ స్త్రీలు ఈ ఎండల తీవ్రతకు త్వరగా అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్నందున వారిపై ప్రత్యేక జాగ్రత్తలు వహించాలి. ఏదైనా కారణం చేత వడదెబ్బ తగిలి రొప్పు రావడం, కళ్ళు తిరగడం లేదా అస్వస్థతకు గురైనట్లు అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## "ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా" సభకు కరపత్ర ఆవిష్కరణ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 22:సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చమన్‌లో "ఎవరి కులం ఎంతో..! వారికంత వాటా..!" అనే నినాదంతో జూన్ 5న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. జూన్ 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్ మైదానంలో, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రాంగణంలో ఈ బహిరంగ సభ జరగనుందని పేర్కొన్నారు. బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు బోయిని సదన్ మహారాజ్, డాక్టర్ మంద బాబు, రవిబాబు, మల్లికార్జున్, రాజన్, డీబీ రాజు, సురేష్, నరేష్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

--తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్‌గౌడ్




పెద్దపల్లి , మే 22:(లోకల్ గైడ్ )అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. వివిధ తెలంగాణ ఉద్యమ సంఘాల పోరాటంతో దిగొచ్చిన ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారి సేవలు, త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే రెండున్నర ఏళ్లు గడిచిపోయాయని, కమిటీ కాలాయాపన చేయకుండా వెంటనే ఉద్యమంలో పాల్గొని కేసులపాలైన నిజమైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకోవాలన్నారు. కమిటీ వేసి సంబరపడట్టం కాదు.. త్వరితగతిన ఉద్యమకారులకు న్యాయం చేస్తే బాగుంటుదన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల ప్రభుత్వ స్థలంతో పాటు ఇల్లు, గుర్తింపు కార్డులు, ప్రాణాలర్పించిన వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం, రైల్వే, బస్ పాస్ ఇవ్వటంతో పాటు నెలకు రూ.25వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామి ఇచ్చిందని గుర్తు చేశారు. ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాల్సిన అవసరముందని ప్రభుత్వానికి సూచించారు. పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో ఏవరైనా నిజమైన ఉద్యమకారులు ఉంటే తమను 9491404333 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక తరుపున నియోజకవర్గ ఇంచార్జీ, నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులను ఎన్నుకున్నారను. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ అనుముల కళావతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రంగారపు శాంతలక్ష్మీ, రాష్ట్ర కోకన్వీనర్ తోడేటి స్వరూప, ఉద్యమకారులు బోయిన సదానందం, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్ర దొంగలపై రైల్వే స్టేషన్లలో 24 గంటలు నిఘా



హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే22(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొద్ది రోజులుగా ఇతర రాష్ట్రాలు నుండి ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్ళు ఇండ్ల చోరీలతో పాటు, చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ కావడం, ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు మారడంతో నేరగాళ్ళు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోని పలు చోరీలకు పాల్పడటం, అనంతరం నిందితులు ఇదే రైలు మార్గం ద్వారా తిరిగి వారి స్వస్థలాలకు చేరకుంటున్నారు. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అంతర్ రాష్ట్ర దొంగలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపోందించారు. ఇందులో భాగంగా అంతర్‌రాష్ట్ర దొంగలను ముందుగా గుర్తిండం అలాగే చోరీల కట్టడికై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, సిసిఎస్ ఏసిపి సదయ్య అధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. రెండు బృందాలు చోప్పున వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తారు. దేశంలోని వివిధ మార్గాల ద్వారా ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుండి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో అగే రైళ్ళలో ఇక్కడకి చేరుకున్న ప్రయాణికుల్లో ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత ప్రయాణికులను గుర్తించి వారిని, వారి సామగ్రిని సైతం కుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి నుండి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత వ్యక్తుల సంబంధిత వ్రేలి ముద్రలు, ముఖాలను ఫేస్ రికగ్నైజేషన్‌తో పాటు పోలీసుల వద్ద వున్న అధునిక పరిజ్ఞానంతో దేశంలోని నేరస్థులకు సంబంధించిన డాటా బెస్‌తో అనుసంధానం చేసి సంబంధిత అనుమానిత వ్యక్తులను పరీక్షించడం జరుగుతుంది. ఈ తనిఖీల్లో ఒక వేళ తనిఖీ చేసిన వ్యక్తి గతంలో ఏదైన నేరానికి పాల్పడినట్లయితే క్షణాల్లో పోలీసులు వినియోగిస్తున్న టెక్నికల్ డివైజ్‌కు అనుమానితుడి పూర్తి వివరాలు చేరిపోతాయి. దీనితో తక్షణమే పోలీసులు అప్రమత్తమై సదరు అనుమానితులను అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. ఇదే సమయంలో ఈ బృందాలు తనిఖీలు చేసే సయమంలో అనుమానిత పూర్తి వివరాలను సైతం రికార్డుల రూపం భద్రపర్చడం జరుగుతుంది. నలుగురు సభ్యులు వున్న ప్రత్యేక బృందంలో ప్రతి రైల్వే స్టేషన్‌ల్లో షిఫ్ట్‌ల వారిగా విధులు నిర్వహిస్తు నిరంతరం అనుమానితులను తనిఖీలు నిర్వహిస్తూ అంతరాష్ట్ర దొంగలకు చెక్ పెడుతున్నారు వరంగల్ కమిషనరేట్ పోలీసులు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం..
## 33 మందికి రూ.2.68 లక్షల జరిమానా



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 22:సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 20 మంది, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 13 మందిపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించారు.సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 20 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరిచారు.విచారణ అనంతరం కోర్టు 20 మందికి కలిపి రూ.2,03,500 జరిమానా విధించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 13 మందికి రూ.65 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతరులకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కోర్టు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తోందని, ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## రాక్ పాయింట్ వద్ద నుంచి యూరియా సప్లై,
## ధాన్యం అన్‌లోడింగ్, పనులను వేగవంతం చేయాలి:
## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి రైల్వే స్టేషన్ లోని యూరియా రాక్ పాయింట్,
పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్



పెద్దపల్లి, మే-22:(లోకల్ గైడ్ )పెద్దపల్లి లోని రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రాక్ పాయింట్ నుంచి యూరియా సప్లై , స్థానిక వ్యవసాయ మార్కెట్ లోని ధాన్యం అన్‌లోడింగ్, పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి లోని రైల్వే స్టేషన్ వద్దగల యూరియా రాక్ పాయింట్ ను, వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,,,జిల్లాలో వ్యవసాయ అవసరాలకు తగ్గట్టుగా రాక్ పాయింట్ వద్ద ఉన్న యూరియాను లారీలు, హమాలీ కార్మికులను సమకూర్చుకొని త్వరగా జిల్లా వ్యాప్తంగా సప్లై చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొస్తున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చేపట్టాలని సూచించారు. లారీల కొరత రాకుండా చూసుకోవడంతో పాటు, పనులకు ఆటంకం కలగకుండా తగినంత మంది హమాలీ కార్మికులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవద్దు

-సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం

-డంపింగ్ యార్డ్ కోసం భూమి కేటాయిస్తే రాజీనామాలకు సిద్ధం..ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక



రంగారెడ్డి, మే 22 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): కొంగరకలాన్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రంగారెడ్డి జిల్లా స్థాయి సమావేశంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వివాదం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. కొత్తూరు మండలంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల లోను భూమి కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల సర్పంచులు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో స్థానిక ప్రజా ప్రతినిధులు తమ నిరసనను గట్టిగా వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని, ప్రజల అభీష్టానుసారంగానే వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలెక్టర్‌తో మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తును పణంగా పెట్టి డంపింగ్ యార్డ్ కోసం భూమి కేటాయిస్తే తామంతా రాజీనామాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఈ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

# రివైజ్డ్ ప్రెస్ నోట్
# సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి కవిత నిరసన

రెండున్నరేళ్లుగా
వ్యవసాయశాఖపై
రివ్యూ చేయని సీఎం
రైతులకు అన్యాయం చేస్తున్న
కర్కోటక ప్రభుత్వం
తక్షణమే ప్రభుత్వం స్పందించాలి.
లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా
ఆందోళనలు
ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్
కల్వకుంట్ల కవిత హెచ్చరిక
సచివాలయం వద్ద ధర్నా,
అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్:రైతుల బాధలను చూసి చలించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం సెక్రటేరియట్ ప్రధాన ద్వారం ముందు కవిత వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి వరికంకులు, ప్ల కార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్తాల్లో తీసుకు వచ్చిన వడ్లను కొందరు రైతులు సెక్రటేరియట్ ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ...రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. ధాన్యం, ముక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారన్నారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని, తరుగు పేరిట మోసం చేస్తున్న పట్టించుకునే వారు లేరని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 45-46 డిగ్రీల టెంపరేచర్ లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు... కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగడాని నీళ్ళు లేవు..టెంట్ లు కూడా వేయలేదని కవిత ప్రభుత్వ నిరక్ష్యంపై మంది పడ్డారు. వడ దెబ్బకు గురై కొందరు చనిపోయారు...పంటలను కొనే వారు లేక, అప్పులు తీరే దారి కనిపించక మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు చనిపోతున్నారన్నారు. రైతులు బాధలను చూసే... ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, రైతులకు మేలు చేయాలని సచివాలయం వద్ద ధర్నా చేస్తున్నామని కవిత చెప్పారు. రైతుల దుఖం మామూలుగా లేదు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు తీస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంట కొనటం లేదన్నారు. వెంటనే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కవితతో సహా రైతులు, మహిళలు, టిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కవితను పలక్ నుమా పోలీస్ స్టేషన్ తరలించగా మిగతావారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మహిళలు, రైతులు నిరసన తెలిపారు.

### ఇది కర్కోటక ప్రభుత్వం

రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వరి కుప్పలపై చనిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని కవిత ప్రశ్నించారు. పలక్ నుమా పోలీస్ స్టేషన్ నుంచి బయటికి వచ్చిన తరవాత కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రైతుల దుఖం మామూలుగా లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాల్లో కలెక్టర్లు రైతులకు అన్యాయం చేస్తున్నారు. గ్రేడ్ ఏ వరిని గ్రేడ్ బి గా రిజిస్టర్ చేస్తున్నారు. సన్న బియ్యానికి ఇచ్చే బోనస్ ఎగ్గొట్టేందుకే డ్రామాలు చేస్తున్నారు. యూరియాకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. వాళ్లు తెచ్చిన యాప్ ఎవరికీ అర్థం కావటం లేదన్నారు మండుటెండలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతుంటే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. అత్యంత కర్కోటక, అమానవీయ ప్రభుత్వం ఇది అంటూ కవిత మండిపడ్డారు. కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలనే తాము సచివాలయం ఎదుట వడ్లు పోసి నిరసన తెలిపామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోని రైతుల సమస్యలను పట్టించుకోవాలన్నారు. లేదంటే రేపటి నుంచి అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు సహా అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతుల గోసను ముఖ్యమంత్రి పట్టించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ మీద రివ్యూ చేసి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహక బహుమతి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే22(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ:చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలుపై జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు



ఎన్ని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారో, ఎలాంటి చర్యలు చేపట్టారో, బాలికల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల పరిస్థితి ఏమిటో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై రహస్య డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారి గురించి 6300030940 ఫోన్ నంబర్‌కు లేదా 104, 1098, 181 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గర్భ విచ్ఛిత్తి కోసం అక్రమంగా వినియోగించే కిట్లను విక్రయించే మెడికల్ షాపులపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని అందించే వారికి రూ.50 వేల ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఇప్పటికే బాలికలు ఉన్న గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, అనుమానాస్పద గర్భ విచ్ఛిత్తి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. చందన మాట్లాడుతూ సంబంధిత శాఖలతో కలిసి రహస్య తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణీలతో పాటు వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల ద్వారా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భ విచ్ఛిత్తులపై సమాచారం సేకరించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, కమిటీ సభ్యులు నీతా పనిభట్, సీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ప్రోగ్రామ్ అధికారి రూబీనా అఫ్రోజ్, డెమో అశోక్ రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ కళ్యాణి, హెల్త్ సూపర్వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక స్టాళ్లను పరిశీలించిన కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 22:సిద్దిపేట కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన -- పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, ఉపాధి, పరిశ్రమలు తదితర శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రజలకు అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరు, అవగాహన కార్యక్రమాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా చేరేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు.ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ



స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజలకు చేరవేయడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించడం, సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం కోసం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే అధికారులు ప్రజలతో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితాను సమగ్రంగా



లోకల్ గైడ్' ఖమ్మం' రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించండి - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ఖమ్మం, ఓటరు జాబితాను సమగ్రంగా, పారదర్శకంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించే లక్ష్యంతో ప్రత్యేక ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 25 జూన్ 2026 నుంచి ప్రారంభమై 01 అక్టోబర్ 2026న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందని, 25 జూన్ నుంచి 24 జూలై వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ముందుగానే వ ం ం ( ది ం చి న ఎ న్యూ వ ం రే ష న్ ఫారాలను పంపిణీ



చేస్తారని చెప్పారు. అనంతరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ స్పష్టంగా చేశారు. విచారణలు, ధృవీకరణ ప్రక్రియ కొనసాగిన అనంతరం తుది ఓటరు జాబితా ప్రచురిస్తారని వివరించారు. ప్రతి ఇంటికి బిఎల్ఓ లు కనీసం మూడు సార్లు వెళ్లి ఫారాల పంపిణీ, సేకరణ చేపడతారని పేర్కొన్నారు. మరణించిన, వలస వెళ్లిన, తదితర ఓటర్ల విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు.బూత్ లెవెల్ లో ఏజెంట్లను నియమించి తమ ఎన్నికల యంత్రాంగానికి సహకరించేలా చూడాలన్నారు. మ్యాపింగ్ పూర్తికాని ఓటర్లు జనన, పాస్‌పోర్ట్, విద్యార్హత , కుల, తదితర 12 రకాలు డాక్యుమెంట్స్ ను సమర్పించవలసి ఉందని పేర్కొన్నారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని అన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం-8 ద్వారా సవరణలు చేపడతామని తెలిపారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్చికమని స్పష్టం చేశారు. ఫారం నింపడంలో ఇబ్బందులు ఎదురైతే బీఎల్వోలు, హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ సేవలను వినియోగించు కోవచ్చున్నారు. ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున కుటుంబ సభ్యులు కూడా ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు.వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేశాలకు కలెక్టర్ వివరంగా నివృత్తి చేశారు. రాజకీయ పార్టీలు బీఎల్ఏలను నియమించిన వెంటనే వారికి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల సంబంధిత శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి

# పరిస్థితులను పర్యవేక్షించాలి

వేగంగా అన్ లోడింగ్ చేయడంపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శుక్రవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ జిల్లాలో సజావుగా సాగుతుందని, కొనుగోళ్ళు ముగిసే వరకు సంబంధిత అధికారులు అందరూ క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మిల్లులు, గోదాంలను తనిఖీ చేస్తూ సమస్యలు ఉంటే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు సేకరించిన గ్రేడ్ ఎ రకం, కామన్ రకం ధాన్యం వివరాలపై అధికారులను అడిగి ఆరా తీశారు. వర్షాలు పడితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని, తూకం వేసిన ధాన్యం బస్తాలను సరిపడా వాహనాలు సమకూర్చి వెంట వెంటనే మిల్లులకు, గోదాంలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తరలించిన వాహనాల్లోని ధాన్యం హమాలీల సంఖ్య పెంచి అన్ లోడ్ చేయాలని సూచించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

## నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజిట్ టు ద మ్యూజియం బస్సు ప్రారంభం

## జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్






రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 23 వ తేదీ వరకు యువజన, క్రీడ, టూరిజం వారోత్సవాలు కొనసాగుతున్నాయి . ఇందులో భాగంగా విజిట్ టు ద మ్యూజియం ఎట్ కరీంనగర్ లో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లే ఆర్ టీ సీ బస్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జగన్ మోహన్ రెడ్డి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖా అధికారి ఎ.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి

వీసీకి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించారు.కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం హాజరయ్యారు.వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రాజేందర్ రెడ్డి, కె.ఎస్.బి. కుమారి, ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, జిల్లా ఖజానా శాఖ అధికారి నవీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదురుగా మరమగ్గ స్థాపన





రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల వేములవాడ వెళ్లే మార్గమధ్యలో రగుడు బైపాస్ రోడ్డు వద్ద గల కలెక్టరేట్ ఆఫీస్ ఎదురుగా రోడ్డు మధ్య సర్కిల్ లో మన సిరిసిల్ల నేతన్న ఖ్యాతిని మరింత ఉన్నత శిఖరాలను చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చొరవతో జిల్లా కలెక్టర్ గరీమ గారి అనుమతితో నేతన్న ఉనికి అయినటువంటి మరమగ్గాన్ని స్థాపించడం జరిగింది, మరమగ్గాన్ని స్థాపించడం మాకెంతో సంతోషంగా స్థానికులు పేర్కొన్నారు, అట్టి మరమగ్గాన్ని ఎంతో ఇష్టంగా అమర్చినటువంటి బోడ రవి, బత్తుల మార్కండేయ, ఆడెపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు
- జిల్లాలో వేగంగా అభివృద్ధి పనులు
- మరమగ్గాల పరిశ్రమకు ఆర్డర్ల కేటాయింపు
- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలో జిల్లాస్థాయి సభ
- వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు
- ఇందిరమ్మ చీరలు, కళ్యాణలక్ష్మి చెక్కులు
- దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ పంపిణీ, ఉపాధి హామీకి కంప్యూటర్ల అందజేత





రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లాస్థాయి సభ జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితె తదితరులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని వినిపించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పనులపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద మార్చి 6వ తేదీ నుంచి వివిధ శాఖల ఆద్వర్యంలో చేపట్టిన పనులు, పురోగతి, అవగాహన సదస్సులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, ఎంపీడీఓ లకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, వ్యవసాయ, ఉద్యానవన, మహిళా సంఘాలు, మత్స్య శాఖ తదితర శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వాటి సమాచారాన్ని సభకు వచ్చిన ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం, చైతన్యపర్చడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నదని తెలిపారు.రాష్ట్రంలో 27 నెలలుగా ప్రజా పాలన సాగుతున్నదని, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందుతుందని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు నిర్వహించామని, అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యులు చేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ నిలుస్తుందని వెల్లడించారు.ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు తమిళనాడు లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు అవుతుందని, కేరళలో కూడా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మిగితా రాష్ట్రాలు కూడా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరవేస్తున్నాయని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ, బీసిల జనగణన చేశామని పేర్కొన్నారు. త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ భీమా పథకం దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా ఇక్కడ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న వారి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు రుణ మాఫీ చేశామని, రైతు భరోసా అందిస్తున్నామని వెల్లడించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్మిక, ధార్మిక క్షేత్రం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని స్పష్టం చేశారు. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు కోటి చీరల ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, గతంలో కూడా ఇచ్చామని దీంతో కార్మికులకు 6 నుంచి 7 నెలల పాటు ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. మొదటి సారి చీరల ఆర్డర్ నీలి రంగు ఇచ్చామని, ఇప్పుడు ఆకు పచ్చ రంగు ఇచ్చామని తెలిపారు. వస్త్ర పరిశ్రమకు బకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. రాష్ట్రం మొత్తం పంపిణి చేసే చీరలు ఇక్కడి సిద్ధం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలు మొదట స్వశక్తి సంఘాలకు ఇచ్చామని, ఇప్పుడు అందరికి ఇస్తున్నామని వెల్లడించారు. 37 వేల మంది మహిళలకు చీరలు సిరిసిల్లలో ఇస్తామని తెలిపారు.వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శంకు స్థాపన చేశారని గుర్తు చేశారు. మరో వెయ్యి ఏండ్ల పాటు ఆలయం ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. సొంత ఇంటి కల నిజం చేసేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు సొంత ఇల్లు కల నిజం చేయడంతో పాటు ఎందరికో ఉపాధి మార్గం దొరుకుతుందని తెలిపారు. త్వరలో రెండో దశలో అర్హులకు ఇస్తామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని, రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తామని తెలిపారు.కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచామని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి వస్తాయని, ఒక్కో స్కూల్ లో 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 36 వేల బెడ్స్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. లో వోల్టేజి పరిష్కారానికి సబ్ స్టేషన్ల ప్రారంభించామని, నూతన వాటి నిర్మాణానికి శంకు స్థాపన చేశామని పేర్కొన్నారు. రైతులు నిర్ణీత డబ్బులు చెల్లిస్తే రైతులకు విద్యుత్ కనెక్షన్, స్తంభాలు ఇస్తారని, అలాగే ఇందిరమ్మ ఇండ్ల వద్ద ఉన్న లూస్ వైర్లు, స్థంభాలు తొలగిస్తారని తెలిపారు. జిల్లా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు.

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మొత్తం 99 రోజుల కార్యాచరణ కింద 10 థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మొదటగా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు పెట్టమని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పూర్తిలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. వేములవాడ రాజన్న గుడి విస్తరణ, అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లాలోని అందరి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. రానున్న అన్ని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అల్పాహారం పథకం, కుటుంబ జీవిత బీమా, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం పథకం, దివ్యాంగ విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నదని తెలిపారు.ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద పోలీస్ శాఖ ఆద్వర్యంలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు, దీంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని వివరించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని గుర్తు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్, హెవీ స్పీడ్ తో వెళ్ళడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి.. చికిత్స, కౌన్సెలింగ్ ఇస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వేసవిలో పిల్లలపై తల్లితండ్రులు దృష్టి సారించాలని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ నాగేంద్రచారి, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా- ఇరాన్‌ల మధ్య కుదరనున్న ఒపపందం

- సౌదీ అరేబియా మీడియా వెల్లడి



టెహ్రాన్ : గత కొన్ని నెలలుగా అమెరికా– ఇరాన్ యుద్ధం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇంధన సంక్షోభం ఏర్పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. ప్రపంచానికి ఉపశమనం కలిగించేలా.. అమెరికా –– ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని.. బహుశా దీనికి సంబంధించి కొన్ని గంటల్లోనే ప్రకటన వెలువడే అవకాశం ఉందని సౌదీ అరేబియా ప్రభుత్వ నేతృత్వంలోని న్యూస్ ఛానెల్ అల్ అరేబియా శుక్రవారం నివేదించింది. అమెరికా –– ఇరాన్ కుదుర్చుకున్న ముసాయిదా ఒప్పందంలో భూ, సముద్ర, వాయు రంగాలలో తక్షణమే బేషరతు కాల్పుల విరమణకు సంబంధించి అంశాలు ఉండనున్నాయని అల్ అరబియా పేర్కొంది. అలాగే ఈ ఒప్పందంలో, సైనిక కార్యకలాపాలకు, మీడియా వైరుధ్యాలకు ముగింపు పలకడంతో పాటు, సైనిక, పౌర, ఆర్థిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోకూడదని ఇరుపక్షాలు పరస్పరం కట్టుబడి ఉండాలనే నిబంధన కూడా ఉన్నట్లు సమాచారం. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత పట్ల గౌరవం, ఇరు దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కూడా ఈ ఒప్పందంలో పొందుపరిచినట్లు సమాచారం. అలాగే అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లలో నౌకాయాన స్వేచ్ఛకు కూడా హామీ ఇస్తుంది. ఈ ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి, ఇరు పక్షాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి ఒక ఉమ్మడి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఈ ముసాయిదా ప్రతిపాదించింది. ఒప్పందం అమల్లోకి వచ్చిన ఏడు రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చలు ప్రారంభమవుతాయని కూడా అందులో పేర్కొన్నట్లు అల్ అరబియా నివేదించింది. ఇరాన్‌పై ఇప్పటివరకు అమెరికా పెట్టిన ఆంక్షల్ని కూడా ఎత్తివేయనుంది. ఈ ముసాయిదా అంతర్జాతీయ చట్టానికి, ఐక్యరాజ్యసమితి పేర్కొన్నట్లు శాంతి, భద్రత, మానవ హక్కులకు కట్టుబడి ఉండటాన్ని పునరుద్ఘాటిస్తున్నట్లు సమాచారం. వాషింగ్టన్, టెహ్రాన్‌లు అధికారికంగా ప్రకటించిన వెంటనే ఈ ఒప్పందం అమల్లోకి రానుందని అల్ అరేబియా న్యూస్ ఛానల్ పేర్కొంది.

## ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో భారత్ లోనే 50



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 50 నగరాలు భారత్ లోనే ఉన్నట్లు నివేదిక తెలిపింది. శుక్రవారం ఉదయం 10.50 గంటలకు ఈ 50 నగరాల్లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలుగా నమోదైనట్లు వాయు నాణ్యత, వాతావరణ సూచిక (ఎక్యూఐ) తెలిపింది. దేశంలోని ఉత్తర, మధ్య మరియు తూర్పు ప్రాంతాలలో తీవ్రమైన వడగాలులు విజృంభించడంతో.. మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటిపోయినట్లు నివేదిక తెలిపింది. ఒడిశాలోని బలాంగిర్ 45డిగ్రీల ఉష్ణోగ్రతతో అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. ఆ తర్వాత 44డిగ్రీల ఉష్ణోగ్రతతో చంద్రాపూర్, ప్రయాగ్‌రాజ్‌లతో పాటు ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్‌లలోని పలు నగరాలు నిలిచాయి. అయితే ఈ జాబితాలో సగానికి పైగా నగరాలు ఉత్తరప్రదేశ్ లోనే ఉండటం గమనార్హం. వారణాసి, బందా, బరేలీ, అయోధ్యల్లో మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 42డిగ్రీల నుండి 43 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఎపి, తెలంగాణల్లో భీమవరం, ఆదిలాబాద్, జగిత్యాలలు ఈ జాబితాలో నిలిచాయి. వాయువ్య, మధ్య భారతదేశ వ్యాప్తంగా వారంరోజుల పాటు తీవ్రమైన వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో పలు రాష్ట్రాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది.

## డబ్ల్యు ఎఫ్ ఐపై మండిపడిన ఢిల్లీ హైకోర్టు




న్యూఢిల్లీ : దేశీయ పోటీల్లో పాల్గొనడానికి రెజ్లర్ వినేష్ ఫోగట్ ను అనర్హురాలిగా ప్రకటించిన నిర్ణయంపై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం మండిపడింది. ఈ నిర్ణయంపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యు ఎఫ్ ఐ)ని తీవ్రంగా మందలించింది. రానున్న ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో ఫోగాట్ పాల్గొనడాన్ని ఖరారు చేయడానికి, అలాగే ఆమె ఫిట్‌నెస్‌ను మూల్యాంకనం చేసేందుకు తక్షణమే ఒక నిపుణుల కమిటీని నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో మాతృత్వాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రసూతి సెలవుల అనంతరం వినేష్ ఫోగట్ తిరిగి క్రీడల్లోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ.. గత ఎంపిక ప్రమాణాలను పక్కనబెట్టి డబ్ల్యు ఎఫ్ ఐ వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టింది. విరోధమేదైనా లేదా వివాదమేదైనా కావచ్చు.. కానీ రెజ్లింగ్ ప్రయోజనాలను ఎందుకు దెబ్బతీయాలని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పారిస్ ఒలింపిక్స్ లో బరువు పరిమితిని పాటించకపోవడం, డోపింగ్ నిరోధక సమస్యలు, ఒలింపిక్ క్వాలిఫైర్ ట్రయల్స్ సమయంలో రెండు విభాగాల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ మే 9న డబ్ల్యు ఎఫ్ ఐ ఫోగట్ కి షోకాజ్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2024 పారిస్ ఒలింపిక్స్ నుండి అనర్హురాలిగా ప్రకటించబడిన తర్వాత ఆమె క్రీడలకు విరామం ప్రకటించారు. గతేడాది జులైలో బిడ్డకు జన్మనిచ్చిన ఫోగట్, 2025 డిసెంబర్ 12న తన పదవీ విరమణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. అనంతరం గోండాలో జరిగిన నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఆమె హాజరయ్యారు. అయితే ఆమె పోటీల్లో పాల్గొనేందుకు డబ్ల్యు ఎఫ్ ఐ అనుమతి నిరాకరించింది. డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం పదవీ విరమణ నుండి తిరిగి వచ్చే క్రీడాకారులు పాటించాల్సిన ఆరు నెలల నోటీసు వ్యవధిని ఆమె పూర్తి చేయలేదని, దీంతో ఆమెను పోటీలకు అనుమతించలేమని డబ్ల్యు ఎఫ్ ఐ పేర్కొంది. డబ్ల్యుఎఫ్ ఐ ఆదేశాలను సవాలు చేస్తూ వినేష్ ఫోగట్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

## ఉమర్ ఖలీద్ కు మధ్యంతర బెయిల్



న్యూఢిల్లీ : జె ఎన్ యు నేత ఉమర్ ఖలీద్ కు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం మూడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ ప్రతిభా ఎం. సింగ్, జస్టిస్ మధు జైన్ లతో కూడిన ధర్మాసనం ఆయనకు మూడు రోజుల బెయిల్ జారీ చేసింది. తన మామగారి 40 రోజుల కార్యక్రమం (చెహ్లామ్) హాజరయ్యేందుకు, తన తల్లి శస్త్రచికిత్స నిమిత్తం మధ్యంతర బెయిల్ కోరుతూ ట్రయల్ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే ఖలీద్ బెయిల్ పిటిషన్ను తిరస్కరిస్తూ మే19న ట్రయల్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఉమర్ ఖలీద్ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో అదుపులోకి తీసుకున్న ఖలీద్ పై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసింది.

# కొత్తరూపు సంతరించుకుంటున్న గాజా టెక్ రంగం

### పాశ్చాత్య భంగం కారణంగా ముందే ముంచుకురానున్న వర్షాలు
### కశ్మీర్, ఉత్తరాఖండ్, రాజస్తాన్, హరియాణా, పంజాబ్, యూపీల్లో అకాల వర్షాల అవకాశం



దేశవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్న వేళ ఉత్తరభారత ప్రజలకు సూర్యప్రతాపం నుంచి భారీ ఉపశమనం కల్పించేందుకు అనూహ్యంగా ఉత్తరభారతంపై భారీ వర్షాలు కురిపించేందుకు పాశ్చాత్య భంగం(వెస్టర్న్ డిస్టబెన్సెస్) సంసిద్ధమవుతోందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మేరకు గురువారం పాశ్చాత్య భంగం తాలూకు గాలుల తాజా ఉపగ్రహ చిత్రాలను వాతావరణ శాఖ విడుదలచేసింది. వడగాల్పులు, ఉక్కపోతతో ఉత్తరభారత ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న సమయంలో చలికాలంలో మంచు, వర్షాలకు కారణమయ్యే పాశ్చాత్య భంగం తాలూకు గాలులు హఠాత్తుగా భారత్ దిశగా వస్తుండటంతో ఎండాకాల వేడిమి జనాలకు ఊరట లభించనుంది. మే 21వ తేదీన ఇన్‌శాట్––3డీఎస్ ఉపగ్రహం ద్వారా తీసిన చిత్రాల్లో పాశ్చాత్య భంగం సంబంధిత గాలులతో మేఘాలు, తుపానుకు ముందు కన్పించే వాతావరణం అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, వాయవ్య భారత గగనతలాలపై అలుముకున్నట్లు కన్పించింది. తెల్లని దట్టమైన మేఘాలు హిమాలయ పర్వతాల వైపు, ఉత్తరభారత మైదానాల దిశగా పయనం మొదలెట్టినట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా తెలుస్తోంది. అరేబియా సముద్రం మీద సైతం తేమతో కూడిన మేఘాలు ఏర్పడ్డాయి. ఈశాన్య భారతం మీద, బంగాళాఖాతం మీద సైతం మేఘావృతమైన వాతావరణ పరిస్థితులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పాశ్చాత్య భంగం లేదా పశ్చిమ విక్షోభం అనేది భారత్‌ను చుట్టుముడితే మరింతగా తేమను మోసుకొచ్చి ఉత్తరభారతంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వాన, ఈదురుగాలులతోపాటు పిడుగులు పడే ప్రమాదముందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఉత్తర పాకిస్తాన్, జమ్మూకశ్మీర్‌లపై ఆకాశం అతిగా మేఘావృతం కావడంతో ఇక్కడి వాతావరణం హఠాత్తుగా మారుతూ అస్థిర పరిస్థితులను తీసుకురావచ్చు. ఈశాన్యభారతం మీదా మేఘాలు అతిగా కన్పిస్తుండటంతో వర్షాకాలం ప్రారంభంకాకమునుపే మెరుపులతో కూడిన వర్షాలు పడే ఆస్కారముందని నిపుణులు అభిప్రాయపడ్డారు. పాశ్చాత్య భంగం ఇలాగే ఉధృతమై ముందుకు సాగితే ఉత్తరభారతంలో ముఖ్యంగా జమ్మూకశ్మీర్, హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాల్లో వచ్చే కొద్దిరోజుల్లో వర్షాలు మొదలయ్యే వీలుంది. ధూళి తుపాన్లు, వడగండ్ల వానలు పడినా ఆశ్చర్యపోనక్కర్లేదని నిపుణులు వ్యాఖ్యానించారు. పాశ్చాత్య భంగం మోసుకొచ్చి తేమ కారణంగా పడే వర్షాలు యావవత్ భారతదేశంలో ఎండ బాధలను పూర్తిగా తగ్గించకపోయినా ఉష్ణోగ్రతలు కాస్తంత తగ్గడానికి ఖచ్చితంగా దోహదపడతాయని నిపుణులు భరోసా ఇచ్చారు. అరేబియా సముద్రం, బంగాళాఖాతం దక్షిణప్రాంతాల్లో పెరిగిన మేఘాల సంచారం నెమ్మదిగా వర్షాకాల వాతావరణాన్ని సృష్టిస్తోంది. పాశ్చాత్య భంగం వేగంగా భారత్‌ను చుట్టుముడితే కనీసం ఉత్తర భారత ప్రజలకైనా ఈ ఉక్కపోత రాత్రుల నుంచి ఉపశమనం కల్గుతుంది. వడదెబ్బల భయం తగ్గుతుంది. అయితే విచ్చలవిడిగా పెరుగుతున్న కాలుష్యం, శిలాజ ఇంధనాల అతి వినియోగం, క్లోరోఫ్లోరో కార్బన్‌లు భారీ స్థాయిలో వెలువడటం వంటివి భారత్‌లో వడగాల్పులు వచ్చే అవకాశాలు ప్రతిఏటా మరింత పెంచేస్తాయని నిపుణులు హెచ్చరించారు.

### ఏమిటీ పాశ్చాత్య భంగం?

మధ్యధరా సముద్ర ప్రాంతం, కాస్పియన్ సముద్రం, నల్ల సముద్రం ప్రాంతాల నుంచి మొదలై తూర్పు దిశగా పయనిస్తూ భారత్‌లోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో శీతాకాలంలో వర్షాలను కురిపించే అల్పపీడన వాయు ప్రసరణ వ్యవస్థను పాశ్చాత్యభంగం లేదా పశ్చిమ విక్షోభం అని పిలుస్తారు. పశ్చిమ విక్షోభ గాలులు తేమను మోసుకొస్తూ ఉత్తరభారతంలో మరీ ముఖ్యంగా హిమాలయాల్లో శీతాకాలంలో భారీగా మంచుకురవడానికి కారణమవుతాయి. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లోనూ వర్షాలకు ఈ పాశ్చాత్య భంగమే కారణం. భారత్‌లో గోధుమపంట దిగుబడినీ పశ్చిమ విక్షోభం నిర్ణయిస్తుంది. సరైన సమయంలో చుట్టుముట్టే పశ్చిమ విక్షోభంతో పంజాబ్, హరియాణా, యూపీ, రాజస్థాన్‌లో గోధుమ దిగుబడి పెరుగుతుంది. శీతాకాలంలో మేఘాలు, వర్షం, హిమపాతం తెచ్చే పాశ్చాత్యభంగం ఒకరకంగా ఉత్తరభారతానికి మరో వర్షాకాలం వంటిది.

## అమెరికా దెబ్బలన్నీ చూసేశాం.. ఇక ఆట మాదే!



ఒకప్పుడు ప్రపంచ దేశాలన్నీ అమెరికా వైపు చూసేవి.. ఇప్పుడు మాత్రం మెల్లగా తమవైపు తిరుగుతున్నాయని చైనా నమ్ముతోంది. అమెరికా వేసిన ఆర్థిక దెబ్బలు, సాంకేతిక ఆంక్షలు, ఒత్తిడులన్నింటినీ తట్టుకుని మరింత బలపడిపోయామని బీజింగ్ భావిస్తోంది. అంతేకాదు.. "ఇప్పటి నుంచి ఆటను నడిపేది మేమే" అనే సంకేతాలు కూడా పంపిస్తోంది. ట్రంప్ పర్యటన తర్వాత మారిన చైనా వైఖరి ఆ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రాజకీయ విశ్లేషకుడు ఆర్నాడ్ బెర్ట్రాండ్ వెల్లడించిన వివరాలు.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. చైనా ప్రభుత్వానికి అనుబంధంగా పనిచేసే ఒక పరిశోధనా సంస్థ తయారుచేసిన నివేదిక ఆధారంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "అమెరికా–చైనా సహజీవనం దిశగా ప్రపంచంలో జరుగుతున్న మహా మార్పు" అనే అంశంపై రూపొందిన ఈ నివేదికలో.. ప్రపంచ రాజకీయాల్లో జరుగుతున్న భారీ మార్పులను చైనా ఎలా చూస్తోందో వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. చైనా ఇప్పుడు అమెరికాను "అడ్డుకోలేని మహాశక్తి"గా చూడటం లేదట. గత కొన్నేళ్లుగా అమెరికా చేసిన ఆర్థిక ఒత్తిడులు, దిగుమతి సుంకాలు, సాంకేతిక ఆంక్షలు, ప్రపంచ దేశాలను చైనా నుంచి దూరం పెట్టే ప్రయత్నాలు.. ఇవన్నీ జరిగినా కూడా చైనా ఎదుగుదలేం ఆగలేదని బీజింగ్ బలంగా భావిస్తోంది. అందుకే "అమెరికా తన బలమైన దెబ్బ ఇప్పటికే కొట్టేసింది.. ఇక చైనాను పూర్తిగా ఆపడం సాధ్యం కాదు" అనే నమ్మకం అక్కడ బలపడిందని చెబుతున్నారు. ఈ ఆలోచనకు చైనా మాజీ కమ్యూనిస్టు నాయకుడు మావో జెడాంగ్ చెప్పిన "దీర్ఘకాల పోరాట సిద్ధాంతం"ను ఉదాహరణగా చూపిస్తున్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం.. మొదట బలహీనంగా ఉన్న దేశం శక్తివంతమైన దేశం ఒత్తిడిని తట్టుకుంటుంది. తర్వాత మెల్లగా ఆర్థికంగా, సాంకేతికంగా, వ్యూహాత్మకంగా బలపడుతూ చివరకు ప్రత్యర్థిని మించిపోతుంది. ప్రస్తుతం చైనా అదే దశలో ఉందని ఆ నివేదిక చెబుతోంది.

### బలప్రయోగం కాదు, కానీ..

ప్రపంచ తయారీ రంగం, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధస్సు, పర్యావరణ హిత ఇంధన సాంకేతికత, బ్యాటరీ తయారీ వంటి రంగాల్లో చైనా వేగంగా ఆధిపత్యం పెంచుకుంటోందని నివేదిక పేర్కొంది. అంటే కేవలం డబ్బు పరంగా మాత్రమే కాదు.. భవిష్యత్తు ప్రపంచాన్ని నడిపించే రంగాల్లో కూడా చైనా ముందుకు దూసుకెళ్తోందన్న మాట. ఇంకో కీలక అంశం ఏమిటంటే.. ప్రపంచ క్రమం కూడా మారుతోందని చైనా భావిస్తోంది. ఒకప్పుడు అమెరికా చుట్టూ తిరిగిన ప్రపంచం.. ఇప్పుడు అనేక శక్తి కేంద్రాలుగా విడిపోతుందని, అందులో తామే ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్నామని బీజింగ్ అంచనా వేస్తోంది. అయితే ఈ మార్పు యుద్ధాల ద్వారా కాదని.. ఆర్థిక బలం, పరిశ్రమల శక్తి, సాంకేతిక ఆధిపత్యం, ప్రపంచ వాణిజ్య సంబంధాల ద్వారా వస్తోందని నివేదిక చెబుతోంది. అంటే చైనా ప్రపంచాన్ని బలవంతంగా జయించాలని కాదు.. ప్రపంచ దేశాలు స్వయంగా చైనాపై ఆధారపడే పరిస్థితి వస్తోందని భావిస్తోందన్నమాట. ఇప్పటివరకు చైనా వ్యూహాత్మక పత్రాల్లో కనిపించిన "అమెరికా భయం" ఈసారి కనిపించలేదని బెర్ట్రాండ్ వ్యాఖ్యానించారు. గతంలో అమెరికాను పెద్ద ముప్పుగా చిత్రీకరించిన చైనా.. ఇప్పుడు మాత్రం దాన్ని మేనేజ్ చేయగలిగే అంశంగా మాత్రమే చూస్తోందట. అంటే అమెరికా ఇబ్బందులు కలిగించగలదు కానీ.. చైనా ఎదుగుదలను పూర్తిగా అడ్డుకోలేదనే నమ్మకం అక్కడ పెరిగిపోయిందన్నమాట.

### తగ్గేదే లే!

అయితే చైనా నేరుగా యుద్ధ దారిలో వెళ్లాలని అనుకోవడం లేదని కూడా ఈ నివేదిక చెబుతోంది. అమెరికాతో పరస్పర గౌరవం, సహజీవనం అవసరమని సూచించింది.

రెండు దేశాల మధ్య నేరుగా ఘర్షణలు జరగకుండా సంభాషణలు కొనసాగించాలని, కృత్రిమ మేధస్సు నియంత్రణ, వాతావరణ మార్పులు, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి అంశాల్లో కలిసి పనిచేయాలని సూచించింది. అదేసమయంలో తైవాన్ విషయంలో మాత్రం చైనా తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. తైవాన్ చివరకు చైనాతో కలవాల్సిందేనని, అమెరికా అక్కడ వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని హెచ్చరించింది. ఈ క్రమంలోనే ట్రంప్ 'తైవాన్ సుదూర' వ్యాఖ్య చేసి ఉంటాడనే విశ్లేషణ నడుస్తోంది. మొత్తంగా ఈ నివేదిక ద్వారా.. ప్రపంచ భవిష్యత్తు నాయకత్వం తమదేనని చైనా ఇప్పుడు గట్టిగా నమ్ముతోందని విశ్లేషకులు అంటున్నారు. అమెరికా ప్రభావం మెల్లగా తగ్గిపోతుందని.. తమ ప్రభావం పెరుగుతుందని బీజింగ్ భావిస్తోంది. అయితే అది యుద్ధాలతో కాదు.. ఆర్థిక బలం, సాంకేతిక ఆధిపత్యం, ప్రపంచ దేశాలు చైనాపై ఆధారపడడం పెరుగుతున్న నేపథ్యాలతో సాధ్యమవుతుందని చైనా అంచనా వేస్తోంది.

# అగ్రజుల గుసగుసలు



రెండు సాధారణ దేశాల అధినేతలు కలిశారంటే వాణిజ్యం, వ్యాపారం, పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకోవడాలు చర్చకొస్తాయి. ఒప్పందాలు కుదురుతాయి. కానీ రెండు అగ్రదేశాలు కలిశాయంటే పైకి కనబడే వాణిజ్య, వ్యాపారాదులతోపాటు గుట్టుచప్పుడు కాకుండా కుదిరే లాలూచీలుంటాయి. వారం రోజుల వ్యవధిలో మూడు అగ్ర రాజ్యాల మధ్య మంతనాలు సాగాయి. గతవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకొస్తే, ఈ బుధవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంతు. స్వల్ప వ్యవధిలో ఇలా ఇద్దరు అగ్రరాజ్యాధినేతలు రావటంవల్ల సహజంగానే చైనా స్థాయి అమాంతం పెరిగిపోయింది. పుతిన్ వచ్చిన సందర్భం సాధారణమైనది కాదు. ఆయనే చెప్పినట్టు 54 సంవత్సరాల క్రితం ఇదేరోజున అప్పటి చైనా అధినేత మావో జెడాంగ్ 'ప్రపంచ దేశాలన్నీ ఏకమై అమెరికా సామ్రాజ్యవాదంపై పోరాడాల'ని పిలుపునిచ్చారు. అప్పటికీ ఇప్పటికీ ప్రపంచం మారింది. పెట్టుబడి ఎగుమతిలో, దేశాలపై ఆర్థికంగా పట్టుబిగించటంలో, ఇరుగుపొరుగును చీకాకుపెట్టడంలో, కనిపించేదంతా తనదేనని ప్రకటించుకోవటంలో చైనా సైతం సామ్రాజ్యవాద పోకడలకు పోతోంది. మధ్యన 'సోషల్ సామ్రాజ్యవాదం' ముద్ర వేయించుకున్న సోవియెట్ యూనియన్ చీలికలూ, పేలికలై కుప్పకూలింది. అందులోని ప్రధాన భాగం రష్యా కూడదీసుకునే ప్రయత్నం చేస్తూ, గత వారసత్వాన్ని కొనసాగించటానికి ఆపసోపాలు పడుతోంది. ఇక అమెరికా పోకడలు దశాబ్దాలుగా అదే బాణీలో కొనసాగుతున్నాయి. గతవారం ట్రంప్‌కు లభించిన స్వాగత సత్కారాలన్నీ పుతిన్‌కు కూడా దక్కాయి. రెడ్‌కార్పెట్ పరచడం, సైనిక వందనం, కేరింతలతో పిల్లలు అభివాదం చేయడం వంటివన్నీ కనబడ్డాయి. అయితే స్వీయ ప్రయోజనాల రక్షణలో తమకెవరూ సాటిరారని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిరూపించారు. ఏవేవో ఒప్పందాలు కుదిరాయని ట్రంప్ చెప్పటమే తప్ప చైనా వైపునుంచి గతవారం ఎలాంటి ప్రకటనలూ రాలేదు. ఇప్పుడు పుతిన్‌కు కూడా దాదాపు అదే అనుభవం ఎదురైంది. ఇంధన సరఫరా కోసం 'పవర్ ఆఫ్ సైబీరియా 2' పేరిట రెండో పైప్‌లైన్ నిర్మాణానికి రష్యా సిద్ధపడినా, చైనా అందుకు సంబంధించి మరింత లోతుగా చర్చించాల్సి ఉందంటూ వాయిదా వేసింది. కాకపోతే తైవాన్ విషయంలో ట్రంప్‌కు 'రెడ్‌లైన్' హెచ్చరిక జారీ అయిన పద్ధతిలో పుతిన్‌కు ఎలాంటి భంగపాటు కలగలేదు. ఎవరికి వారు అవతలివారిని వేలెత్తి చూపడమే తప్ప, తమ తప్పులెరగరని ట్రంప్, పుతిన్‌ల పర్యటనలు నిరూపించాయి. హోర్ముజ్ జలసంధి ప్రతిష్టంభన, ఇరాన్ యుద్ధం విషయంలో గతవారం అమెరికా, చైనాలు 'ఏకాభిప్రాయం' ప్రకటిస్తే... ఇప్పుడు చైనా, రష్యాలు సైతం అలాంటి స్వరమే వినిపిస్తున్నాయి. 'ఏకపక్ష వ్యవహారశైలి, ఆధిపత్యవాద ధోరణులు' ఉండరాదని కోరాయి. ప్రపంచం ఆటవిక న్యాయంలోకి దిగజారే ప్రమాదం కనబడుతోందని ఆందోళన వ్యక్తంచేశాయి. తరచిచూస్తే ఈ మూడు దేశాలూ జంకూ గొంకూ లేకుండా ఆధిపత్య ధోరణులు ప్రదర్శిస్తున్నాయి. అయినా గంభీరస్వరాలతో హితవు పలికే సాహసం చేస్తున్నాయి. అమెరికా సైన్యం వెనెజులా అధ్యక్షుణ్ణి భార్యా సమేతంగా చీకటిచాటున అపహరించుకు పోయింది. ఇరాన్ అగ్రనేతను ఇజ్రాయెల్‌తో కలిసి హత్య చేసింది. క్యూబాను కబళించటానికి కత్తులు నూరుతోంది. రష్యా నాలు గేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉంది. దురాక్రమణకు దిగకపోయినా ఆసియా ఖండ దేశాల్లో చైనా కండబల ప్రదర్శన తక్కువేం కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పుతిన్‌కు చైనా అవసరమే ఎక్కువుంది. ఉక్రెయిన్‌ను తక్కువ అంచనా వేసి యుద్ధంలోకి దిగి, అది తీవ్రంగా దెబ్బతింది. పుతిన్ స్వీయభద్రతే ప్రమాదంలో పడింది. రష్యా కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించిన ఉక్రెయిన్... 'రష్యా తలపెట్టిన మే 9 విక్టరీ పెరేడ్ సజావుగా సాగటానికే' దీనికి అంగీకరించామంటూ ఎద్దేవా చేసింది. దానికితోడు 2008 తర్వాత తొలిసారి ట్యాంకులు, క్షిపణులు లేకుండా ఆ పెరేడ్ హడావుడిగా ముగిసింది. మొత్తానికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఆ రెండు దేశాల మాదిరిగా తనపై ఇంకా దురాక్రమణదారు ముద్రపడనందువల్లే ఈమాత్రం ప్రతిష్ఠయినా దక్కుతున్నదని చైనా గ్రహించి సవ్యంగా వ్యవహరిస్తే అదే పదివేలు!

